

ఉష్ణోగ్రత (అంచనా)

7-5-2025	గరిష్టం	కనిష్టం
గుంటూరు	39	27
తెనాలి	38	27
నరసరావుపేట	39	27
బాపట్ల	37	27
రెంటచింతల	39	27
చీరాల	37	27

బర్లీ కొనేవారేరి?



● ఉప్పుటూరు గ్రామంలో పొగాకు బేళ్లు

- సరైన ధర లేక రైతుల ఆవేదన
- కొనుగోళ్లకు ముందుకు రాని వ్యాపారులు
- మూడు జిల్లాల్లో 96 వేల ఎకరాల సాగు
- ఆదుకోవాలని బర్లీ పొగాకు రైతుల వేడుకోలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఆశాజనకంగా దిగుబడులు.. మార్కెట్‌లో మంచిధర.. సంప్రదాయ పంటల సాగుతో పోల్చుకుంటే లాభాలతో.. ఇటు బాపట్ల జిల్లాలో అత్యధికంగా, అటు పల్నాడు, గుంటూరు జిల్లాల్లో కొంతమేర రైతులు ఈ సీజన్‌లో బర్లీ పొగాకు సాగు బాట పట్టారు. పత్తి, మిర్చి పంటల సాగుకు ఎక్కువ పెట్టుబడి అవుతుండడంతో పాటు దిగుబడులు అంతంతమాత్రంగా ఉండడంతో వాటిని కాదని బర్లీ సాగు వైపు పెద్దసంఖ్యలో రైతులు ఆకర్షితులయ్యారు. ఈ పరిస్థితుల్లో గతేడాదితో పోలిస్తే సాగు రెట్టింపయినట్లు గణాంకాలు చెబుతున్నాయి. గంపెడాశలతో సాగు చేపట్టిన రైతులు ప్రస్తుతం బర్లీ పొగాకు కొనే దిక్కు లేక అల్లాడుతున్నారు. గడచిన రెండేళ్లతో పోలిస్తే దిగుబడుల్లో 30 శాతం క్షీణత నమోదు కాగా ధర అమాంతం సగానికి సగం పడిపోవడంతో రైతులు కుదేలయ్యారు. ధర విషయంలో పరిష్కారం చూపి ఆదుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. పర్చూరు మండలం వీరన్నపాలెం గ్రామానికి చెందిన పొగాకు కౌలు రైతు ఒకరు మంగళవారం ఆత్మహత్య చేసుకోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ప్రభుత్వం ఆదుకోకపోతే ఆత్మహత్యలే శరణ్యమని రైతులు వాపోతున్నారు.

గతేడాది క్వింటా రూ.16,000 వరకు

గతేడాది బ్లాక్, వైట్ బర్లీ పొగాకు ధర క్వింటా రూ.16,000 వరకు పలికింది. వ్యాపారులు అడ్వాన్సులు ఇచ్చి మరీ బుక్ చేసుకున్నారు. ఈ నేపథ్యంలో రైతులు ఇతర పంటలను కాదని బర్లీ పొగాకు సాగు వైపు గణనీయంగా మళ్లడంతో పొగనారుకు పెద్దఎత్తున డిమాండ్ కూడా ఏర్పడింది. గతేడాది బాపట్ల జిల్లాలో బర్లీ సాగు 40,000 ఎకరాలకు పరిమితమైతే ఈ ఏడాది అది దాదాపు 70,000 వరకు పెరిగింది. గుంటూరు, పల్నాడు జిల్లాల్లో సైతం 26,000 ఎకరాల వరకు సాగైంది. ప్రస్తుతం 96 వేల ఎకరాల్లో దిగుబడులు వస్తున్నాయి. అయితే ధర క్వింటాలకు పదివేలకు దిగువనే ఉంది. పైగా దిగుబడులు కుచించుకుపోవడం, అకాల వర్షాలు గోరుచుట్టు మీద రోకలిపోటులా మారడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారు. అయినకాడికి అమ్ముకుందామన్నా వ్యాపారులు కన్నెత్తి చూడటంలేదని రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం తీసుకునే చర్యల మీదే ఆశతో రైతులు ఎదురుచూస్తున్నారు.

ప్రభుత్వ ఆదేశాలు పట్టని వ్యాపారులు

బర్లీ పొగాకు, నాటు పొగాకు తమ పరిధిలోకి రావని పొగాకు బోర్డు చేతులెత్తేసింది. రైతులను ఆయా కంపెనీల దయదాక్షిణ్యాల మీదనే వదిలేసింది. వర్జీనియా పొగాకు సాగు చేస్తున్న రైతులకు టుబాకో బోర్డు కొన్ని ప్రత్యేక రక్షణలు కల్పిస్తున్నది. కానీ అవేవీ కూడా బర్లీ పొగాకు రైతులకు వర్తించకపోవడమే ప్రస్తుత దుస్థితికి కారణంగా ఉంది. పొగాకు బోర్డు చేతులెత్తేయడంతో రెండు వారాల క్రితమే ప్రభుత్వం రంగంలోకి దిగింది. ఆయా కంపెనీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి రైతులకు న్యాయం చేయాలని సూచించింది. కానీ క్షేత్రస్థాయిలో ఆ నిర్ణయాలు అమలు చేయడంతో వ్యాపారుల నిర్లక్ష్యం బర్లీ రైతులకు శాపంగా పరిణమించింది. ప్రభుత్వం వైపు నుంచి కంట్రోల్ రూం ఏర్పాటు చేయడం మొదలుకుని వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శిని క్షేత్రస్థాయి పర్యటనకు పంపినా వ్యాపారుల్లో చలనం లేదు. గతంలో లాభాల పంట పండించుకున్న కంపెనీలు ప్రస్తుతం ఈ సమస్య తమది కాదన్నట్లుగా వ్యవహరిస్తున్నాయి.



ఉప్పుటూరులో బర్లీ పొగాకు రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి రాజశేఖర్, పక్కన ఎమ్మెల్యే ఏలూరి

నీటి సంఘాలు.. నిర్వీర్యం

ఉత్సవ విగ్రహాల్లా నీటి సంఘాల అధ్యక్షులు

- వారి అధికారాలను హరిస్తోన్న అధికారులు
- సమావేశాల ఏర్పాటుకు ఇష్టపడని జలవనరులశాఖ
- కాల్వల మరమ్మతులు.. నీటి పంపిణీలో భాగస్వామ్యం లేదాయే

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

◆ నీటి సంఘం సమావేశం నిర్వహిద్దామని ఓ డీసీ అధ్యక్షుడు ఓ అధికారిని కోరగా.. మొబైల్ ద్వారా మాట్లాడుతున్నారుగా. ఇక ప్రత్యేకంగా సమావేశంతో పనేముందని సమాధానం.

◆ సమావేశం గురించి మాట్లాడేందుకు ఓ నీటి సంఘం అధ్యక్షుడు ఓ అధికారికి ఫోన్ చేయగా.. బిజీగా ఉన్నాను.. తర్వాత మాట్లాడతాను.. అని సమాధానమిచ్చి ఇంతవరకు స్పందించలేదు.

◆ నీటి సంఘాల బాధ్యతలను చూసే ఓ అధికారిని సమావేశం గురించి ప్రశ్నిస్తే చూద్దాం లేండి.. అని సమాధానం.

..ఇదీ గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని నీటి సంఘాల అధ్యక్షులతో అధికారులు వ్యవహరిస్తున్న తీరు. అధికారుల సమాధానాలతో నీటి సంఘాల అధ్యక్షులు కంగుతింటున్నారు. అధికారుల తీరుతో నీటి సంఘాల బాధ్యులు ఆందోళన చెందుతున్నారు. అసలు తాము నీటి సంఘాల అధ్యక్షులమా కాదా.. తమకు అధికారాలు ఉన్నాయా లేవా.. అని అయోమయంలో ఉన్నారు. ఓ పథకం ప్రకారం నీటి సంఘాలను నిర్వీర్యం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న ఆందోళన ఎన్నికైన వారిలో వ్యక్తమవుతోంది. అధ్యక్షుల పరిస్థితి ఉత్సవ విగ్రహాల చందాన ఉందన్న ఆరోపణలు ఉన్నాయి.

ప్రభుత్వ లక్ష్యాల మేరకు కాల్వల నిర్వహణలో, నీటి పంపిణీలో భాగస్వాములను చేయాలని సంఘాల అధ్యక్షులు కోరుతున్నారు. సకాలంలో వర్షాలు కురిసి ప్రాజెక్టుకు నీరు వస్తే జూలైలో నీటి సరఫరా చేసే అవకాశం ఉంటుంది. ఈ లోగా కాల్వల మరమ్మతులు పూర్తి చేయాల్సి ఉంది. ఏ కాల్వలో.. ఏ పనులు చేయాలనే విషయంలో సంఘాలకు పూర్తి అవగాహన ఉంటుంది. రైతుల ద్వారా సమస్యలు తెలుసుకుని పనులు చేపడితే సాగుదారులకు నీటి ఇబ్బందులు ఉండవు. అయితే ఈ దిశగా జలవనరుల శాఖ స్పందించడంలేదు. కనీసం నీటి సంఘాలతో సమావేశాలు నిర్వహించేందుకు కూడా సదరు అధికారులు ఇష్టపడటం లేదని పలువురు అధ్యక్షులు వాపోతున్నారు. నీటి సంఘాలను నిర్వీర్యం చేసేలా అధికార యంత్రాంగం వ్యవహరిస్తోందన్న విమర్శిస్తున్నారు.

కార్యాలయాలు అప్పగించలేదు

ప్రపంచ బ్యాంకు నిధులతో సాగర్ కాల్వల ఆధునికీకరణ పనులు చేశారు. ఈ సందర్భంగా కార్యాలయాల నిర్మాణానికి నిధులు కేటాయించారు. ఈ నేపథ్యంలో డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు చాలా చోట్ల కార్యాలయాలు నిర్మించారు. ఆయా కార్యాలయాలను డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు అప్పగించాల్సి ఉంది. అయితే ఈ విషయాన్ని నెలలు గుడుస్తున్నా అధికారులు పట్టించుకోలేదు.



లింగంగుంట్లలోని జలవనరుల శాఖ కార్యాలయాలు

నిధులు.. అధికారాలు లేవు

రైతులు ఏటా చెల్లించే నీటి తీరువాలో 80 శాతం నిధులను నీటి సంఘాలకు కేటాయించాలి. ఈ ప్రక్రియను అమలు చేసే పరిస్థితులు కానరావడంలేదని అధ్యక్షులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాగునీటి వినియోగదారుల సంఘాలు, డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, ప్రాజెక్టు కమిటీలకు నిర్దిష్టమైన అధికారాలను ప్రభుత్వం కల్పించినా వాటిని కొందరు హరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. పైగా అధికారుల తీరు సంఘాలను అవమానించేలా ఉన్నాయన్న విమర్శలున్నాయి.

ప్రభుత్వ లక్ష్యానికి విరుద్ధంగా అధికారులు

సాగునీటి వ్యవస్థను బలోపేతం చేసేందుకు కూటమి ప్రభుత్వం ఐదు నెలల క్రితం నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించింది. కాల్వల నిర్వహణ.. సాగునీటి పంపిణీలో సంఘాలను భాగస్వాములను చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. రైతులకు దగ్గరగా ఉంటూ సాగు నీటి సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయడంతో పాటు కాల్వల మరమ్మతులు, చివరి భూమి వరకు సాగునీటిని అందించడంలో కీలక పాత్ర పోషించాలని ప్రభుత్వం సంఘాలకు సూచించింది. ఇది నిజమే కదా అని ఆయా పనులు చక్కపెట్టేందుకు ప్రయత్నిస్తున్న సాగునీటి సంఘాలకు జలవనరుల శాఖ అధికారుల నుంచి అవమానాలే ఎదురవుతున్నాయని కొందరు అధ్యక్షులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాల్వల నిర్వహణ పనులను గుర్తించడం, నీటి తీరువా వసూళ్లలో నీటి సంఘాలను భాగస్వాములను చేయాలని ప్రభుత్వం సూచిస్తోంది. అయితే ప్రభుత్వ లక్ష్యాల ను జలవనరుల శాఖ తుంగలో తొక్కుతుందన్న విమర్శలున్నాయి.

పల్నాడులో భారీ వర్షం

- ఈదురు గాలులు.. వడగళ్లతో వాన
- కొత్తూరులో పిడుగుపడి విద్యార్థి మృతి

గురజాలటౌన్, దాచేపల్లి, కారంపూడి, రొంపిచర్ల, మే 6 (ఆంధ్రజ్యోతి): మంగళవారం మధ్యాహ్నం వరకు మండిన భానుడు.. ఆ తర్వాత మబ్బుల చాటుకు వెళ్లిపోయాడు. పల్నాడులో పలు ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతం కాగా వాతావరణంలో విపరీతమార్పులు చోటుచేసుకున్నాయి. దీంతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం పడింది. కొన్ని ప్రాంతాల్లో వడగళ్లతో వానతో ప్రజలు వణికిపోయారు. వ్యవసాయ పనులు ముగింపునకు చేరుకున్న ప్రాంతాల్లో ప్రస్తుతం కురిసిన వర్షం మేలు చేస్తుందని రైతులు చెపుతున్నారు. వేసవి తాపం, వడగాలులతో తల్లడిల్లి పోతున్న ప్రజలు అకాల వర్షంతో ఉపశమనం పొందారు. గురజాల పట్టణంలో మంగళవారం సాయంత్రం కురిసిన వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. బ్రహ్మనాయుడు సెంటర్లో ఫ్లెక్సీలు, భారీ కటౌట్లు నేలకొరిగాయి. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. దాచేపల్లిలో అరగంట సేపు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం ఏకధాటిగా కురిసింది. మండలంలోనా రామాపురం, తంగెడ, ముత్యాలంపాడు, కేసానుపల్లి, పెదగార్లపాడు, నడికుడి, ఇరికేపల్లి, గామాలపాడు గ్రామాల్లో భారీగా వర్షం కురిసింది. కారంపూడి మండల పరిధిలోని పలు గ్రామాల్లో మంగళవారం వడగళ్ల వాన కురిసింది. మంగళవారం తెల్లవారు జామున రొంపిచర్ల మండలంలోని గ్రామాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. పలు చోట్ల చెట్ల కొమ్మలు విరిగి పడ్డాయి.




గురజాల నగర పంచాయతీ కార్యాలయంలో వర్షపు నీరు



కారంపూడిలో పొలాల్లో వడగళ్లు

పిడుగుపడి ఇంటర్ విద్యార్థి మృతి



వేసవిలో సెలవలు కావడంతో పొలం పనుల్లో తల్లిదండ్రులకు సహాయం చేస్తున్న సమయంలో పిడుగుపాటుకు గురై దాచేపల్లి మండలం కృష్ణానది తీరంలోని కొత్తూరు గ్రామానికి శివనాయక్(22) మృతి చెందాడు. పొలంలో పుల్లలు, పిచ్చి కంప తొలగిస్తుండగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసి పిడుగు పడటంతో విద్యార్థి అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామానికి చెందిన బాణావత్ శ్రీరాములు, నరసమ్మలకు చిన కుమారుడైన శివనాయక్ మృతితో గ్రామంలో విషాదం అలుముకుంది. ఇతడు దాచేపల్లి ఏపీ మోడల్ స్కూల్‌లో ఇంటర్ మొదటి సంవత్సరం పూర్తి చేసుకుని రెండో సంవత్సరానికి వచ్చాడు.

బ్రాహ్మణపల్లి వద్ద నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాల భవనాలు



నిర్మాణాలు.. నత్తనడకన

- నాలుగేళ్లుగా సాగుతున్న నిర్మాణాలు
- ఈ ఏడాదీ వైద్య విద్య అడ్మిషన్లు లేనట్లే
- వైద్య కళాశాల పూర్తయ్యేందుకు మరో రెండేళ్లు



హాస్టల్ భవనాలు

పిడుగురాళ్ల, మే 6 (ఆంధ్రజ్యోతి): రెండేళ్లు అన్నారు.. నాలుగేళ్లు అవుతున్నా ఇంకా నిర్మాణాలు సాగుతునే ఉన్నాయి. వచ్చే విద్యా సంవత్సరంలో అడ్మిషన్లు జరుగుతాయి.. పల్నాడులో వైద్య విద్యతో పాటు మెరుగైన వైద్యం అందుబాటులోకి వస్తుందన్న ఆశ ఏటికేడు వాయిదా పడుతూనే ఉంది. పిడుగురాళ్ల సమీపంలోని బ్రాహ్మణపల్లి వద్ద నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాలలో ఈ ఏడాది కూడా అడ్మిషన్లు లేనట్టే. కళాశాల, హాస్టల్ భవనాల నిర్మాణాలు నాలుగేళ్లుగా కొనసాగుతున్నాయి. ఈ నిర్మాణాలు పూర్తి అయ్యేదెప్పుడు.. ఇండియన్ మెడికల్ కౌన్సిల్ అడ్మిషన్లకు అనుమతి ఇచ్చేది ఎప్పుడు అంటే ఎవరూ చెప్పలేకపోతున్నారు. హాస్పిటల్ భవనాలు పూర్తిచేసిన తర్వాతే అడ్మిషన్లకు అనుమతి ఇచ్చే అవకాశం ఉంది. 2021 మే 30న అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో మెడికల్ కళాశాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రెండేళ్లలో పూర్తి చేస్తామని శంకుస్థాపన సమయంలో ముఖ్యమంత్రి ఆర్భాటంగా ప్రకటించారు.

నిధులు విడుదలలో జాప్యం

పల్నాడులో వైద్య కళాశాల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.500 కోట్లు కేటాయించింది. సుమారు 45 ఎకరాల భూమి కొనుగోలు చేశారు. వైద్య కళాశాల, హాస్టల్, వైద్యుల క్వార్టర్స్ నిర్మాణాలు చేపట్టారు. అయితే నిధులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయడంలో జాప్యం చేసింది. దీంతో సంబంధిత కాంట్రాక్టర్ పనులను నత్తనడకగా చేపట్టారు. ఈ కారణంగా నాలుగు ఏళ్లుగా సాగుతున్నాయని సమాచారం. ప్రస్తుతానికి కళాశాల భవనాలు కొన్ని శ్లాబు దశలో ఉండగా, మరికొన్ని తుదిదశలో ఉన్నాయి. హాస్టల్ భవనాలు కూడా కొన్ని పూర్తవగా మరికొన్ని నిర్మాణాలు సాగుతూనే ఉన్నాయి. 45 శాతం నిర్మాణ పనులు పూర్తికాగా, రూ.220 కోట్లు మాత్రమే ఖర్చు చేయగలిగారు. పనులు ఆ సాంతం పూర్తయ్యేందుకు మరో రెండేళ్ల సమయం పట్టే అవకాశం ఉందని ఇంజనీరింగ్ అధికారులు వెల్లడించారు.

జూలకల్లులో.. కార్డన్ సెర్చ్

- మారణాయుధాలు గుర్తింపు.. స్వాధీనం
- గొడవలు సృష్టిస్తే పీడీ యాక్ట్: డీఎస్పీ హెచ్చరిక



జూలకల్లులో కార్డన్ సెర్చ్ వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ హనుమంతరావు

పిడుగురాళ్ల, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో సమస్యాత్మకమైన జూలకల్లు గ్రామంలో గురజాల ఇన్‌చార్జ్ డీఎస్పీ హనుమంతరావు ఆధ్వర్యంలో మంగళవారం తెల్లవారుజామున కార్డన్ సెర్చ్ జరిగింది. అనుమానిత ప్రాంతాలను, గడ్డివాములు, పాడుబడిన ప్రదేశాలను అణువణువున సోదాలు నిర్వహించారు. గ్రామంలోని ఇళ్లల్లో వేటకొడవళ్లు, గొడ్డళ్లు, మరికొన్ని మారణాయుధాలను గుర్తించిన పోలీసులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమన్నారు. గొడవలు సృష్టించే, పాల్పడే వారిపై బైండోవర్ కేసులతో పాటు పీడీ యాక్ట్‌ను అమలు చేస్తామని హెచ్చరించారు. సమస్యాత్మకమైన జూలకల్లు గ్రామంపై పోలీసుల నిఘా ఎప్పుడూ ఉంటుందన్నారు. పార్టీలకు అతీతంగా గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలే తప్ప కక్షలు, కార్పణ్యాలకు పాల్పడకూడదని సూచించారు. పోలీసు కేసులతో జీవితాలను ఛిన్నాభిన్నం చేసుకోవద్దన్నారు. ఈ కార్డన్ సెర్చ్‌లో సీఐలు వెంకట్రావు, భాస్కరరావు, ప్రభాకరరావుతో పాటు 12 మంది ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

పేరేచర్ల-కొండమోడు రోడ్డుకి..

నేడు శంకుస్థాపన

● భూసేకరణ పూర్తి.. రూ.881.61 కోట్లు కేటాయింపు

సత్తెనపల్లి, రాజుపాలెం, మే 6 (ఆంధ్రజ్యోతి): అధ్వానంగా.. ఇరుకుగా.. ప్రమాదాలకు నెలవుగా మారిన పేరేచర్ల - కొండమోడు జాతీయ రహదారికి ఎట్టకేలకు మోక్షం లభించింది. నాలుగు వరసలుగా విస్తరించేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపి నిధులు విడుదల చేసింది. ఇప్పటికే భూసేకరణ పూర్తి చేసి, రైతులకు పరిహారం కూడా అందజేశారు. ఈ క్రమంలో బుధవారం రాజుపాలెం మండలంలోని రెడ్డిగూడెం గ్రామ పరిధిలోని ఆకులగణపవరం గ్రామం వెళ్లే మూలమీద భూమిపూజ నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్థన్‌రెడ్డి ఈ కార్యక్రమానికి హాజరుకానున్నట్లు కూటమి నేతలు ప్రకటించారు. పల్నాడు ప్రాంతంలో కీలకమైన ఈ రహదారి విస్తరణకు ప్రభుత్వం రూ.881.61 కోట్లు మంజూరు చేసింది. హైదరాబాద్ నుంచి అమరావతికి అనుసంధానం చేసే ఈ జాతీయ రహదారి పూర్తయితే గుంటూరు - పల్నాడు ప్రాంత ప్రజలకు హైదరాబాద్ వెళ్లడం సులువవుతుంది. ప్రస్తుతం ఉన్న రోడ్డు అధ్వానంగా ఉండటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దీంతో గుంటూరు నుంచి హైదరాబాద్ వెళ్లాలనుకునే వారు విజయవాడ మీదగా వెళ్తున్నారు. పల్నాడువాసులు నరసరావుపేట, నకరికల్లు, గురజాల, మాచర్ల మీదగా హైదరాబాద్ వెళ్తున్నారు. ఇలా వెళ్తుండటంతో ప్రయాణికులకు దూరంతో పాటు సమయం వృథా అవుతుంది. పేరేచర్ల - కొండమోడు రోడ్డు ఏడు నుంచి పది మీటర్ల వెడల్పు మాత్రమే ప్రస్తుతం ఉంది. ఈ కారణంగా వాహనాల రద్దీ పెరిగి నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ పరిస్థితుల్లో హైవేను నాలుగు వరుసలుగా విస్తరించనున్నారు. ఒక్కో వైపు 8.75 మీటర్ల వెడల్పు ఉంటుంది. మధ్యలో డివైడర్ 1.5 మీటర్లు, రెండువైపులా మార్జిన్లు కలిపి 22.5 మీటర్ల వెడల్పుతో విస్తరించనున్నారు. ఈ హైవేలో భాగంగా మేడికొండూరు, సత్తెనపల్లి, కొండమోడులో బైపాస్‌లను నిర్మిస్తారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ చొరవతో పనులు ప్రారంభమవుతున్నాయని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 49.917 కిలో మీటర్లు నిర్మాణం జరిగే 167 ఏజీ రహదారి నిర్మాణంతో పల్నాటి ప్రాంత వాసుల కష్టాలు తీరినట్లే.



సత్తెనపల్లి - కొండమోడు రహదారి



చిక్కడు, దొరకడు.. చిన్నోడు!

- నియోజకవర్గాన్ని విడిచి పరారై సంవత్సరం
- అజ్ఞాతంలో మాజీ ఎమ్మెల్యే సోదరుడు
- అన్న జన్మదిన వేడుకల్లో ప్రత్యక్షం

8

కేంద్రసాహిత్య అకాడమి అవార్డు గ్రహీత
పెనుగొండకు ఘన సన్మానం

వినుకొండ, మే 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జాషువా కళా ప్రాంగణంలో సోమవారం రాత్రి కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు గ్రహీత, అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణను ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు ఘనంగా సన్మానించారు. ముందుగా వినుకొండ పట్టణంలోని పలువురు కళాకారులు ఆయనను ఘనంగా ఊరేగించారు. అనంతరం శివయ్య, గంగినేని, జాషువా విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జాషువా కళాప్రాంగణంలో అభి



పెనుగొండ లక్ష్మీనారాయణ దంపతులను సన్మానిస్తున్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

నందన సభ ఏర్పాటు చేశారు. జీవీ అంజనేయులు పాల్గొని, మాట్లాడుతూ కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు అందుకున్న పెనుగొండను రాష్ట్ర ప్రభుత్వం తగిన రీతిలో గౌరవించేందుకు తాను చొరవ తీసుకుంటానని తెలిపారు. పెనుగొండ మాట్లాడుతూ నాడు చెప్పులు లేకుండా తాను నడిచిన పుర వీధుల్లో నేడు కారులో ఊరేగించడం ఆనందంగా ఉందన్నారు. అందుకే తాను వినుకొండను మరువనని, తనను వినుకొండ మరువదని పేర్కొన్నారు. అభ్యుదయ కవి పులుపుల శివయ్య చిన్నవయసులో వేలుపట్టి బిడ్డగా నడిపించారని అందుకే ఆయన పేరుతో ఏటా సాహితీవేత్తలకు పురస్కారాలు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్రసాద్, సీనియర్ న్యాయవాది చెరుకూరి సత్యనారాయణ, వెటర్నరీ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ పారా లక్ష్మయ్య, సీహెచ్ఎల్ఎన్ మూర్తి, పి.జె.లూకా, సీపీఐ నేతలు మారుతి వర ప్రసాదరావు, బొంకూరి వెంకటేశ్వర్లు, రోటరీ క్లబ్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, కౌన్సిలర్ షేక్ షకీలా, గీతాంజలి విద్యాసంస్థల చైర్మన్ ఎండ్లూరి శేషగిరిరావు, వినుకొండ బార్ అసోసి యేషన్ అధ్యక్షుడు మీసాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణ సామగ్రి పక్కదారి.. విశ్రాంత ఏఈ అరెస్టు

పెదకూరపాడు, మే 6 (ఆంధ్రజ్యోతి): పెదకూరపాడు గృహ నిర్మాణ శాఖ ఏఈగా పనిచేస్తున్న సమయంలో రూ.47 లక్షల విలువైన ఇనుము, సిమెంట్ లెక్క అప్పగించని షేక్ పాషాను మంగళవారం పెదకూరపాడు పోలీసులు అరెస్టు చేశారు. గృహ నిర్మాణ శాఖ డీఈ సూర్య భగవాన్ గతేడాది జూన్ 23న 97 టన్నుల గృహ నిర్మాణానికి అవసరమైన ఇనుము, 230 బస్తాల సిమెంట్‌ను ఏఈ పాషా పక్కదారి పట్టించారని ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వైసీహెచ్ అల్లూరిరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయనను గుంటూరులో అరెస్టు చేశామని వివరించారు. గృహ లబ్ధిదారుల్లో ఒకే వ్యక్తికి ఇనుము రెండుమూడు సార్లు ఇచ్చినట్లు రికార్డుల్లో ఏఈ నమోదు చేశారని తెలిపారు. గృహ నిర్మాణశాఖ అధికారుల విచారణలో రెండుమూడు సార్లు తాము ఇనుము తీసుకోలేదని లబ్ధిదారులు చెప్పారు. అప్పటి నుంచి ఈ విశ్రాంత ఏఈ పరారీలో ఉన్నారని ఎస్ఐ తెలిపారు.

ప్రేమజంట ఆత్మహత్యాయత్నం

● ప్రియుడు మృతి.. ప్రియురాలు క్షేమం ● యడ్లపాడు మండలం కొండవీడులో ఘటన ● కొడుకు మృతిపై తండ్రి అనుమానం

యడ్లపాడు, మే 6 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం కొండవీడు రెవెన్యూ పరిధిలో ప్రేమ జంట ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కలకలం రేపింది. ఈ ఘటనలో ప్రేమికుడు మృతిచెందగా.. తీవ్రగాయాలతో ఉన్న ప్రియురాలిని యువకుడి స్నేహితులు రక్షించారు. అయితే మృతుడి తండ్రి మాత్రం ఈ వ్యవహారంపై అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు రూరల్ మండలం దాసరిపాలెం గ్రామానికి చెందిన కొర్నెపాటి మహేష్, కవిత కుమారుడు తేజ(19) చౌడవరంలోని ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడ మండలం పరశురామాపురం గ్రామానికి చెందిన ఓ కుటుంబం దాసరిపాలెం పరిధిలోని ఒక నూలు మిల్లులో పనిచేస్తూ.. గ్రామంలోనే నివాసం ఉంటోంది. సదరు కుటుంబానికి చెందిన యువతి కీర్తన అలియాస్ సమీరా, తేజ మూడేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. వీరి ప్రేమను ఇరు కుటుంబాల పెద్దలు అంగీకరించలేదు. తేజ సోమవారం రాత్రి స్నేహితులు చందు, కోటితో కలసి కారులో బయటకు వెళ్లాడు. వారితో పాటు తెల్లవారు జామున కీర్తనతో కలసి కొండవీడు రెవెన్యూ పరిధిలో (చౌడవరం బాలకుటీర్ వెనుకనున్న)ని క్వారీ గుంత వద్దకు వెళ్లాడు. గుంత ఒడ్డున గల 50 అడుగుల కొండ పైకి చేరుకుని అక్కడి నుంచి ప్రేమి కులిద్దరూ క్వారీలోకి దూకారు. ఈ ఘటనలో తేజ నీటిలో మునిగిపోయి మృతిచెందగా.. కీర్తనను అక్కడికి చేరుకున్న స్నేహితులు రక్షించారు. గాయపడిన కీర్తనను గుంటూరు జీజీహెచ్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. తేజ స్నేహితులు కోటి, చందు వీరిని క్వారీకుంట వద్ద వదలి వెళ్లారని, కొద్దిసేపటికి తేజ, కీర్తనల నుంచి ఫోన్ రావడంతో ఇద్దరూ తిరిగి క్వారీ గుంత వద్దకు వెళ్లగా.. కేకలు వేస్తూ ఉన్న కీర్తనను కాపాడారని పోలీసులు తెలిపారు. పెద్దలు వీరి ప్రేమను కాదనడంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు కథనాలు ఒక వైపు వస్తున్నప్పటికీ.. తేజ తండ్రి మహేష్, స్థానికులు మాత్రం అది ఆత్మహత్య కాదని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయాన్ని పోలీసుల దృష్టికి మహేష్ తీసుకెళ్లారు. పోలీసులు చందు, కోటిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. చిలకలూరిపేట రూరల్ సీఐ సుబ్బనాయుడు, యడ్లపాడు ఎస్ఐ శివరామకృష్ణ నేతృత్వంలో క్వారీ కుంటలోని నీళ్లను సాయంత్రానికి పూర్తిగా తోడించడంతో తేజ మృతదేహం బయటపడింది. పెద్దలు తమ ప్రేమను నిరాకరించినందు వల్లనే ప్రేమికులిద్దరూ ఆత్మహత్యకు పాల్పడ్డారా.. లేక ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు.



కొర్నెపాటి తేజ (ఫైల్)



ప్రేమజంట ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన క్వారీ గుంత

గ్రంథాలయాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

● గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర చైర్మన్ గోనుగుంట్ల

గుంటూరు(తూర్పు), మే 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నిరాదరణకు గురవుతున్న గ్రంథాలయాల అభివృద్ధికి, మాతృ భాషా వికాసానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు వెల్లడించారు. రాష్ట్ర గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక ప్రతినిధులు మంగళవారం స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని ఆయన కార్యాలయంలో కలసి వినతి పత్రం అందజేశారు. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన కార్యక్రమాల్ని, రాష్ట్ర సదస్సు చేసిన తీర్మానాలను వేదిక కన్వీనర్ వల్లూరు శివప్రసాద్ ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా గోనుగుంట్ల మాట్లాడుతూ గ్రంథాలయాల్లో నూతన పుస్తకాలు కొనుగోలు, ఉద్యోగాల భర్తీ, విద్యా సంస్థల్లో గ్రంథాలయాల అభివృద్ధిపై కసరత్తు చేస్తున్నామని, సంబంధిత అధికారులతో చర్చించి త్వరలోనే సమస్యల్ని పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో చలపాక ప్రకాష్, పరుచూరి అజయ్ కుమార్, సీహెచ్ సుశీల, మోతుకూరి అరుణకుమార్, నానా, శ్రీవశిష్ట, ఎస్ఎం సుభాని ఉన్నారు.



కోటేశ్వరరావుకు వినతిపత్రం అందజేస్తున్న వేదిక ప్రతినిధులు

రేషన్ షాపుల్లో విజిలెన్స్ తనిఖీలు



దమ్మాలపాడు రేషన్ షాపులో తనిఖీ చేస్తున్న విజిలెన్స్ సీఐ శివాజీ

గుంటూరు సిటీ, మే 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలోని రేషన్ షాపుల్లో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. పల్నాడు జిల్లా ముప్పాళ్ల మండలంలోని బొల్లవరం, దమ్మాలపాడు గ్రామాల్లోని రేషన్ షాపుల్లో స్టాక్‌ను పరిశీలించారు. సత్తెనపల్లిలోని మండల స్థాయి స్టాక్ పాయింట్‌లో రికార్డులు తనిఖీ చేశారు. విజిలెన్స్ సీఐ పల్లపు శివాజీ మాట్లా డుతూ రేషన్ సరుకులను సరిగా ప్రజలకు పంపిణీ చేయాలని, అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డీలర్లను హెచ్చరించారు. రెవెన్యూ అధికారులు, విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీ సీపీడీసీఎల్ టెక్నికల్ డైరక్టర్‌గా మురళీకృష్ణయాదవ్

గుంటూరు, మే 6(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ టెక్నికల్ డైరక్టర్‌గా ఆవుల మురళీకృష్ణ యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. విద్యుత్ శాఖలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో సుపరిచితులైన ఆయన ఏఈ స్థాయి నుంచి ప్రస్థానం ప్రారంభించారు. తెనాలి డివిజన్ ఆపరేషన్ డీఈగా పనిచేశారు. 2022 నుంచి ఉమ్మడి గుంటూరు జిల్లా సర్కిల్ ఆపరేషన్స్ ఎస్ఈగా రెండేళ్లకు పైగా కొనసాగారు. అనంతరం ఉద్యోగోన్నతిపై విజయవాడ కార్పొరేట్ కార్యాలయంలో సీజీఎంగా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. ఆయన సేవలను, సమర్థతను గుర్తించిన ప్రభుత్వం తాజాగా సీపీడీసీఎల్ టెక్నికల్ డైరక్టర్‌గా నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది. రెండేళ్ల పాటు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. విజయవాడలోని కార్యాలయంలో బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ మేరకు గుంటూరు టౌన్-1 ఆపరేషన్ ఈఈ తిరుమలశెట్టి శ్రీనివాసబాబు, పలువురు అధికారులు, ఉద్యోగ సంఘాల నాయకులు మురళీకృష్ణకు అభినందనలు తెలియజేశారు.



అటవీ సంపదను అమ్మేస్తున్నారు..

● అటవీశాఖ అధికారులు మామూళ్లు తీసుకుంటున్నారు

పిడుగురాళ్ల, మే 6 (ఆంధ్రజ్యోతి): అవి పులిచింతల ప్రాజెక్టు ముంపు ప్రాంతాలు. అక్కడే విస్తారమైన.. అటవీ సంపదపై కొందరి కన్ను పడింది. పగలు, రాత్రి అనే తేడాలేకుండా చెట్లను నరికి సొమ్ము చేసుకుంటున్నారు. మాచవరం, బెల్లంకొండ మండలాల సరిహద్దుల్లో ఈ దందా యథేచ్ఛగా సాగుతోంది. ఇక్కడి ఎమ్మాజిగూడెం అటవీ ప్రాంతంలో చెట్లను యంత్రాల సాయంతో నరికి, దుంగలను ఎమ్మాజిగూడెం, శ్రీరుక్మిణీపురం, పిల్లుట్ల మీదుగా పిడుగురాళ్ల బైపాస్‌కు చేరుకొని.. అక్కడి నుండి గుంటూరు, జానపాడు రోడ్డులో ఉన్న ఓ మిల్లుకు తరలిస్తున్నారు. మరి కొన్ని పీఓపీ తయారీ కంపెనీ లకు కూడా అటవీ సంపదను విక్రయించి, జేబులు నింపుకుంటున్నారు. అక్రమార్కులకు కొందరు అట వీశాఖ అధికారులు సహకరిస్తున్నారు. ఒక్కో ట్రక్కుకు వెయ్యి రూపాయలు చొప్పున మామూళ్లు తీసుకుంటున్నారు. రోజుకు 5 ట్రక్కుల కలపను తరలిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.



ట్రాక్టర్లలో తరలిస్తున్న అటవీ సంపద

ఎస్సీ క్రైస్తవులను ఎస్సీ హిందువులుగా నమోదు చేసిన జగన్ సర్కార్

పొన్నూరుటౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి) : షెడ్యూల్ కులాల నుంచి మారిన క్రైస్తవులను, చాలా మంది పాస్టర్‌లను జగన్ ప్రభుత్వం ఎస్సీ హిందువులుగా నమోదు చేసిందని జీసెస్ బిలీవర్స్ అసోసియేషన్ కౌన్సిల్ చైర్మన్, ప్రొఫెసర్ జోసెఫ్ మోసగంటి మంగళవారం ఆరోపించారు. జగన్ ప్రభుత్వంలో సచివాలయ సిబ్బంది ఆన్‌లైన్ డేటా బేస్ నమోదు చేసిన సమయంలో ప్రజల వివరాలను అడగకుండానే కేవలం ఓటీపీ అడిగి సమాచారం నమోదు చేశారని ఆరోపించారు. ప్రజలు తాము పాస్టర్‌లమని, క్రైస్తవులమని చెప్పినప్పుడు క్రైస్తవ సర్టిఫికెట్ చూపించమని అడిగారన్నారు. కొంత మంది క్రైస్తవులుగా సర్టిఫికెట్‌లు చూపించినప్పటికీ హిందూ మతం నుంచి మారామని చెప్పినప్పుడు కూడా హిందువులుగా నమోదు చేశారని ఆరోపించారు. షెడ్యూల్ కులాల క్రైస్తవులు బీసీ-సీ కేటగిరీలోకి వెళ్లిపోతారని అన్నారు. వారిని కూడా ఎస్సీ హిందువుల కేటగిరిగా చూపిస్తే కేంద్ర ప్రభుత్వ నిధులు వస్తాయని అలా చేశారని ఆరోపించారు. దీని మూలంగా జగన్ ప్రభుత్వం లాభపడింది కానీ, క్రైస్తవులు ఇరుక్కుపోయారన్నారు. జగన్ రెడ్డి క్రైస్తవ సమాజానికి మేలు చేయకపోగా ఘోరమైన అన్యాయం చేశారన్నారు. చర్చిలకు వెళ్లే పాస్టర్లు, షెడ్యూల్ కులాల వారు క్రైస్తవులుగా నమోదు చేయించుకోవాలంటే తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి దరఖాస్తు చేసుకోవాలని జోసెఫ్ మోసిగంటి సూచించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	147, 156, 167
చికెన్ విత్ స్కిన్(కిలో)	284.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	294.00

కమిటీలను పూర్తి చేసుకోవాలి : ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

మాచర్లటౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ముఖ్య నేతలు, కార్యకర్తలు ఈనెల 18వ తేదీ నాటికి అన్ని కమిటీలు పూర్తి చేసుకోవాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి మంగళవారం అన్నారు. బూత్ కమిటీలు, గ్రామ కమిటీలు, వార్డు కమిటీలు, మండల కమిటీలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళా కమిటీలన్నింటినీ వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ నెలలో మహానాడు సమావేశం నాటికి పూర్తి చేసుకోవాలని సూచించారు.

నడికూడి యార్డులో 5,900 మిరప టిక్కీల అమ్మకాలు

దాచేపల్లి, మే 6(ఆంధ్రజ్యోతి) : నడికూడి వ్యవసాయ మార్కెట్ యార్డులో జరుగుతున్న మిర్చి అమ్మకాలకు మంగళవారం 6,800 మిర్చి యార్డుకు చేరుకోవటంతో 5,900 టిక్కీలు అమ్మకాలు జరిగాయి. 334 రకం రూ.8 వేల నుంచి రూ.12వేలు, తేజ రకం రూ.9 వేలు నుంచి రూ.13,500, తాలు గాయాలు రూ.2వేలు నుంచి రూ.7వేలు వరకు అమ్మకాలు జరిగాయి.

నేడు వాసవీ మాత జన్మదిన వేడుకలు

రెంటచింతల, మే 6 (ఆంధ్రజ్యోతి): రెంటచింతలలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో వాసవీమాత జన్మదిన వేడుకలు నేడు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ కట్టమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. ఆలయ పూజారి శ్రీనివాసశర్మ నేతృత్వంలో సుప్రభాతసేవ, లలిత విష్ణు సహస్రనామ పారాయణం, 102 మంది మహిళలతో కుంకుమ పూజ, పురవీధుల్లో ఊరేగింపు, భారీగా అన్నదానం ఉంటుందన్నారు.

ఉద్యాన పంటలకు రాయితీ పెంపు

● జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ

దుర్గి, మే 6(ఆంధ్రజ్యోతి): ఉద్యానశాఖలో పండ్ల, పూల తోటలపై ప్రభుత్వం రాయితీలు పెంచిందని నీటియాజమాన్య సంస్థ పీడీ సిద్ధలింగమూర్తి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందికి నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని పలు సూచనలు చేశారు. ఉద్యాన పంటలకు రాయితీలు పెరిగాయన్నారు. ఐదు ఎకరాలలోపు పొలం ఉన్న రైతులకు ఉపాధిహామీ పథకం కింద 100 శాతం రాయితీపై పండ్ల తోటలు సాగు చేసుకోవచ్చన్నారు. ఈ సమావేశంలో ఏవో, ఎంపీడీవో, సిబ్బంది పాల్గొన్నారు.

లారీ కింద పడి వ్యక్తి మృతి

దుర్గి, మే 6 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు లారీ కింద పడి వ్యక్తి మృతిచెందిన సంఘటన మంగళవారం దుర్గి జడ్పీ హైస్కూల్ వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మాచర్ల పట్టణానికి చెందిన మామిళ్ల అంజి (45) కాగితాలు ఏరుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం దుర్గిలో కాగితాలు ఏరుకుంటున్న సమయంలో మాచర్ల నుంచి ఒంగోలు వెళ్తున్న కేసీపీ సిమెంట్ లోడు లారీ హైస్కూల్ వద్ద స్పీడు బ్రేకరు దాటుతుండగా అంజి కాగితాల మూట లారీకి తగలడంతో అంజి ప్రమాదవశాత్తూ లారీ వెనుక టైరు కింద పడిపోయాడు. అంజి కాలిపై నుంచి లారీ వెళ్లడంతో కాళ్లు నలిగిపోయాయి. 108 అంబులెన్స్‌లో మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. మృతుడి భార్య సాగర్ ఫిర్యాదు మేరకు దుర్గి పోలీసులు కేసు నమోదు చేసి అంజి మృతదేహాన్ని మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కాగా లారీ డ్రైవర్ బత్తుల శ్రీనివాసరావును, లారీని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ సుధీర్‌కుమార్ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

ఆర్టీసీలో విజిలెన్స్ విచారణ

సత్తెనపల్లి, మే 6 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఆర్టీసీ డిపోలో డీఎం పై వచ్చిన ఆరోపణల పై మంగళవారం కూడా విజయవాడ ప్రధాన కార్యాలయం నుంచి వచ్చిన విజిలెన్స్ బృందం విచారణ కొనసాగింది. పలువురు కార్మికులను విజిలెన్స్ బృందం విచారణ జరిపింది. మొత్తం మీద స్థానిక ఆర్టీసీ డిపోలో విజిలెన్స్ విచారణ కార్మిక వర్గాల్లో ఇటీవల చర్చనీయాంశంగా మారింది.

మద్యం షాపుల తనిఖీ

సత్తెనపల్లి రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందిగామ, ధూళిపాళ్ల పణిదం గ్రామాల్లోని మద్యం షాపులను సత్తెనపల్లి ఎక్సైజ్ సీఐ పీ విజయకుమార్ మంగళవారం తన సిబ్బందితో కలసి తనిఖీ నిర్వహించారు. స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం షాపు నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంఆర్‌పీ ధరకే మద్యాన్ని విక్రయించాలని, బెల్టు షాపులను ప్రోత్సహించ రాదన్నారు. ఎకౌంట్ రిజిస్టర్ అబ్‌డేట్ చేయాలని, ఎంఆర్‌పీ ధరల పట్టికను షాపు వద్ద ప్రదర్శించాలని నిర్వాహకులను ఆదేశించారు. ఆయా షాపుల్లోని సేల్స్ మెన్‌లకు ఆయన సూచనలు చేశారు. ఈ తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్ఐ నాగలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

భూసార పరీక్షల కోసం మట్టి నమూనాల సేకరణ

క్రోసూరు, మే 6(ఆంధ్రజ్యోతి) : క్రోసూరు మండలంలో వచ్చే వ్యవసాయ సంవత్సరానికి గాను భూసార పరీక్షల కోసం 825 మట్టి నమూనాల సేకరణ లక్ష్యంగా ఉందని మండల వ్యవసాయ అధికారి వేణుగోపాల్ అన్నారు. మండలంలోని పీసపాడులో మంగళవారం మట్టి నమూనాల సేకరణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ హాజరైన రైతులకు భూసార పరీక్షల ప్రాముఖ్యత గురించి వివరించారు. మట్టి నమూనా తీసే విధానాన్ని ఈ సందర్భంగా ఆయన ప్రయోగాత్మకంగా చూపించారు.

● **నకరికల్లు, మే 6 (ఆంధ్రజ్యోతి) :** భూసార పరీక్షలు చేయించు కోవటం ద్వారా రైతులకు పెట్టుబడి ఖర్చు తగ్గుతుందని ఏవో దేవదాసు తెలిపారు. మండలంలోని గుండ్లపల్లి గ్రామంలో మట్టి నమూనాలను సేకరించారు. ఇప్పటివరకు ఎనిమిది వందల నమూనాలను సేకరించినట్లు తెలిపారు.

మూల మలుపులు.. ప్రమాదాలకు నిలయాలు

● వేగనిరోధక బోర్డులు ఏర్పాటు చేయని తీరు
● ఇబ్బందులు పడుతున్న వాహన చోదకులు

బెల్లంకొండ, మే 6 (ఆంధ్రజ్యోతి): మూల మలుపులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. రహదారులపై ప్రయాణం సాఫీగా సాగాలి. ఏ ఇబ్బంది లేకున్నా గమ్య స్థానాలకు చేరుకోవాలంటే మూల మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయటం లేదని విమర్శలు వినవస్తున్నాయి. బెల్లంకొండ నుంచి మాచాయపాలెం వెళ్లే రహదారిలో మూల మలుపు ప్రమాదకరంగా మారింది. మూల మలుపు వద్ద ఎలాంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయక పోవటంతో ఇటీవల కాలంలో ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొని గాయాల పాలైన సంఘటనలు చాలా ఉన్నాయి. బెల్లంకొండ నుంచి చంద్రాజుపాలెం వెళ్లే మార్గంమధ్యలో మాచాయపాలెం


బెల్లంకొండ సమీపంలో ఉన్న మూల మలుపు

మూలమలుపు వద్ద ప్రమాదం పొంచి ఉంది. మాచాయపాలెం నుంచి పాపాయపాలెం వెళ్లే రహదారి వద్ద రెండు మూడు చోట్ల అధికంగా మూల మలుపులు ఉండటంతో వాహనాలు దగ్గరకు వచ్చే వరకు మలుపు కన్పించక వేగాన్ని అదుపు చేయలేక వాహనాల అదుపు చేయలేక అదుపు తప్పి పలువురికి గాయాలైన సంఘటనలు ఉన్నాయి. వేగ నిరోధక బోర్డులు సూచికల బోర్డులు లేక వాహన దారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మూల మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలని వాహన దారులు కోరుతున్నారు.


చంద్రాజుపాలెం వెళ్లే రహదారిలో ఉన్న మూల మలుపు

పొగాకు రైతులపై కంపెనీ ప్రతినిధుల వివక్ష

● నాణ్యత పేరుతో వెనక్కి పంపిన బేళ్లు..

రెంటచింతల, మే 6 (ఆంధ్రజ్యోతి): రైతులకు పొగాకు సాగు శాపంగా మారింది. లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి సాగు చేసిన పొగాకును కొనుగోలు చేసేందుకు మేదరమెట్లలోని కంపెనీ అధికారులు నాణ్యతా లోపాన్ని చూపుతున్నారని సాగుదారులు వాపోతున్నారు. 150 బేళ్లను వెనక్కి పంపి రైతులను ఇబ్బందులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులకు తమకు ఇష్టం వచ్చినట్లుగా ధరలో కోతలు విధిస్తూ తమకు తీరని అన్యాయం చేస్తున్నారనే బాధను వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలు చేయాలని రైతులు గట్టిగా కోరితే నాణ్యత లోపం ఉందని తక్కువ ధరకు ఇవ్వండి లేదా మీ చావు మీరు చావండంటూ దురుసుగా సమాధానం చెప్పారని రైతులంటున్నారు. నాణ్యత పేరుతో అన్యాయం చేయడం ఏమిటని పశర్లపాడు, తుమ్మకోట, గోలి గ్రామాలకు చెందిన రైతులు ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. 40 ఏళ్ల తరువాత పత్తి, మిర్చికి ప్రత్యామ్నాయంగా వైట్ బర్లీ పొగాకును సుమారు 180 ఎకరాల్లో సాగు చేస్తే చేతులు కాల్చుకోవాల్సిన దుస్థితి దాపురించిందనే బాధను వ్యక్తం చేస్తున్నారు.


వెనక్కి తీసుకొచ్చిన పొగాకు బేళ్లు

రైతులకు తీవ్ర అన్యాయం

● ఆరికట్ల నాగిరెడ్డి(పశర్లపాడు గ్రామం)

నేను రెండెకరాల్లో పొగాకును సాగు చేశా.. పంట చేతికి వచ్చిన తరువాత నాణ్యత లేదనే సాకుతో మద్దతు ధర ఇవ్వకుండా బేళ్లను వెనక్కి పంపించారు. దీంతో ఏమి చేయాలో దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. ఎకరాకు రూ.40 వేలు దాకా నష్టం వచ్చింది. మొదట్లో రూ.15500 ధర కల్పిస్తామన్నారు. ఇప్పుడేమో రూ.6 వేలకు మించి కొనడం లేదు.

ఒప్పంద ధర కల్పించాలి

● కావూరి అశోక్ కుమార్

నేను 7 ఎకరాల్లో పొగాకు సాగు చేశాను. మేదరమెట్ల వేలం కేంద్రంలో విక్రయించడానికి వెళితే నాణ్యత సాకుతో వాళ్లంతా సిండికేట్‌గా ఏర్పడి రూ.6 వేలకు మించి కొనేదిలేదని ఖరాఖండిగా చెప్పారు. కొన్ని బేళ్లను అమ్ముకోగా మరి కొన్నింటిని వెనక్కి పంపించారు. మమ్మల్ని ప్రభుత్వమే ఆదుకోవాలి.

నేడు నియోజకవర్గ స్థాయి సమావేశం

సత్తెనపల్లి, మే 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాకతీయ కల్యాణ మండపంలో ఈనెల 7వ తేదీ బుధవారం ఉదయం 10 గంటలకు నియోజకవర్గ అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం జరగనుంది. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశంలో కలెక్టర్ అరుణ్‌బాబు, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, వివిధ శాఖల అధికారులు పాల్గొంటారు.


గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు సాధించిన సత్తెనపల్లి కేంద్రీయ విద్యాలయం విద్యార్థి పీ అంకిత్‌పాల్‌ను మంగళవారం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ తన కార్యాలయంలో అభినందించారు. - **సత్తెనపల్లి**

హజ్‌యాత్రకు వెళ్లే ముస్లింలకు 8న సాయం

పిడుగురాళ్ల, మే 6(ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు మైనారిటీ నేతలతో సమావేశమైన యరపతినేని మళ్లీ హజ్‌యాత్రకు వెళ్లే వారికి ప్రతి ఏడాది సాయమందిస్తానని భరోసా ఇచ్చారు. అనుకున్నట్టుగానే కూటమి అధికారంలోకి వచ్చి ఏడాదిలోపే గురజాల నియోజకవర్గం నుంచి మూడు కుటుంబాల మైనారిటీలను హజ్‌యాత్రకు వెళ్లేందుకు ఒక్కొక్కరికి లక్ష రూపాయలు అందించి పంపిస్తుండటాన్ని గురజాల మైనారిటీ నేతలు మంగళవారం పిడుగురాళ్ల పార్టీ కార్యాలయంలో వివరించారు. గురజాల నియోజకవర్గంలో ఎమ్మెల్యే యరపతినేని మైనారిటీల ఆత్మ బంధువు అని మరోసారి రుజువు చేస్తున్నారని మైనారిటీ సెల్ రాష్ట్ర నాయకుడు షేక్ బాబావలి, జిల్లా అధ్యక్షుడు సయ్యద్ అమీర్ అలి, ముస్లిం నాయకులు ఫరీద్‌మేస్త్రి తదితరులు పేర్కొన్నారు. ఈ నెల 8వ తేదీ గురువారం దాచేపల్లిలోని విజయభాస్కర కల్యాణ మండపంలో జరిగే కార్యక్రమానికి రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ జనాబ్ హసన్‌బాషా, మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ జనాబ్ మౌలానా ముస్తాక్ అహ్మద్‌లు ముఖ్యఅతిథులుగా హాజరు కానున్నారు. ఈ కార్యక్రమంలో షేక్ అబ్దుల్ హఫీసాబ్, షేక్ ముజీబ్, టీడీపీ మస్తాన్‌వలి, కార్ సైదా, సయ్యద్ ఇర్షాద్, అబ్దుల్ గని, వాచర్ బుడే, షేక్ షబ్బీర్, ఆర్‌టీపీ సైదా, తదితరులు పాల్గొన్నారు.

వాసవీ అమ్మవారి జన్మదిన మహోత్సవాలు

పిడుగురాళ్ల, మే 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జన్మదిన మహోత్సవాలను పురస్కరించుకొని మంగళవారం అమ్మవారిని శాకాంబరి దేవిగా అలంకరించారు. ఈ సందర్భంగా పట్టణంలోని వందలాది మంది మహిళలు, భక్తులు కుంకుమపూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. అనంతరం పూజా కార్యక్రమంలో పాల్గొన్న వారికి లక్కీడిప్ నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అధ్యక్షుడు యేలూరి చంద్రశేఖరరావు, ప్రధాన కార్యదర్శి కొలిశెట్టి సుబ్బారావు, కొత్త లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.


శాకాంబరి అలంకరణలో కన్యకాపరమేశ్వరి అమ్మవారు

కార్మికులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

● న్యాయాధికారి ప్రశాంత్

మాచర్లటౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి): కార్మికులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మాచర్ల జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయాధికారి పి ప్రశాంత్ అన్నారు. మంగళవారం పట్టణంలోని చెన్నకేశవ కాలనీలో నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సులో ఆయన పాల్గొని కార్మికులకు పలు సూచనలు చేశారు. కార్మికులు పని ప్రదేశాల్లో ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే కార్మిక చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ న్యాయవాది జి వెంకటేశ్వర్లు, మెట్టు గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


న్యాయ అవగాహన సదస్సులో మాట్లాడుతున్న న్యాయాధికారి ప్రశాంత్

కార్మిక శాఖ ఆధ్వర్యంలో..

సత్తెనపల్లి, మే 6 (ఆంధ్రజ్యోతి) : మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్ విజయకుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం ఇండస్ట్రియల్ ఎస్టేట్ పార్కులో గల శ్రీవల్లి నేషనల్ రూపింగ్ కంపెనీలో కార్మికులకు న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. పారా లీగల్ వలంటీర్ షేక్ ఖాజావలి, కార్మిక శాఖ ఉద్యోగి శ్రీనివాసరెడ్డి తదితరులు వివిధ కార్మిక చట్టాల గురించి వివరించారు.

రూ.300 వేతనం వచ్చేలా మార్కింగ్ ఇచ్చి పని చేయించాలి

● డ్వామా పీడీ సిద్ధ లింగమూర్తి

నకరికల్లు, మే 6 (ఆంధ్రజ్యోతి) : ఈ వేసవిలో ఉపాధి వేతన దారులంతా రోజు వారి వేతనం రూ.300లకు తగ్గకుండా వచ్చే విధంగా టెక్నికల్ అసిస్టెంట్‌లు కొలతలు మార్కింగ్ ఇచ్చి పని చేయించాలని డ్వామా పీడీ సిద్ధ లింగమూర్తి ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం మండలంలోని నరసింగపాడు గ్రామంలో పంట కాలువల్లో పూడిక తీత పనులను ఆయన పరిశీలించారు. గరిష్ట వేతనం పొందే విధంగా వేతన దారులకు అవగాహన కల్పించాలని, కొలతలకు మార్కింగ్ సక్రమంగా ఇవ్వాలని ఉపాధి ఉద్యోగులను ఆదేశించారు. మండలానికి నిర్దేశించిన లక్ష్యంలో ఎంత మేర పని చేశారు?, పూర్తి చేయాల్సిన పని దినాలను నిర్ణీత సమయంలో ఉద్యోగులకు సూచించారు.


నరసింగపాడులో ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ సిద్ధ లింగమూర్తి

కిశోర బాలికలకు ఆరోగ్యంపై అవగాహన


పెదకూరపాడులో కిశోర బాలికలకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మున్ని

పెదకూరపాడు, మే 6 (ఆంధ్రజ్యోతి): కిషోర్ బాలికలు రుతుస్రావం, పరిశుభ్రత, ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ మున్నీ అన్నారు మండలంలోని లగడపాడు, పెదకూరపాడు గ్రామాల్లో కిషోరి వికాసంపై మంగళవారం కిషోర్ బాలికలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ భవానీ, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

● అచ్చంపేట, మే 6 (ఆంధ్రజ్యోతి) : చింతపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర బాలికలకు పరిశుభ్రతపై సూపర్‌వైజర్ మాణిక్యమ్మ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మహిళా సంరక్షణ కార్యదర్శి ఎల్ విల్లి, వీవో ఎస్‌కే హజాబీ, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

● నకరికల్లు, మే 6 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కేంద్రాల్లో కిశోర బాలికలకు బాల్య వివాహాలపై అవగాహన కల్పించాలని సత్తెనపల్లి సీడీపీవో ఎం శ్రీలత సూచించారు. నకరికల్లులోని అంగన్‌వాడీకేంద్రంలో ఆమె 11 నుంచి 18 సంవత్సరాల వయస్సు ఉన్న బాలికలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏసీడీపీవో సంతోషకుమారి, సూపర్‌వైజర్ ఎస్‌కే రమీజాన్, మహిళా పోలీసు రషీద, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సలీం కుటుంబానికి రూ.2 లక్షలు ఆర్థిక సాయం

అచ్చంపేట, మే 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చింతపల్లి గ్రామానికి చెందిన ఎస్‌కే సలీం అనే యువకుడు ఆర్థిక సమస్యల వల్ల ఇటీవల ఆత్మహత్య చేసుకున్నాడు. పేద కుటుంబమైన సలీం తల్లిదండ్రుల పరిస్థితిని అచ్చంపేటకు చెందిన సామాజిక కార్యకర్త ఎస్‌కే కమల్ సైదా తెలుసుకొని ప్రపంచ యాత్రికుడు నా అన్వేషణ అన్వేష్ దృష్టికి తీసుకు వెళ్ళి వారి కుటుంబానికి రూ.2 లక్షలు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా అన్వేష్ చింతపల్లిలో మృతి చెందిన సలీం తల్లిదండ్రులతో మాట్లాడి కుటుంబానికి జరిగిన నష్టానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మద్యపానం, డ్రగ్స్ వల్ల, బెట్టింగ్ యాప్‌ల వల్ల అనేక మంది యువకులు ప్రాణాలు తీసుకుంటున్నారని, ఈ చర్యలను ప్రశ్నిస్తూ అందరినీ చైతన్యవంతం చేయాలని మృతునికి తల్లిదండ్రులకు తెలిపారు. ఈ సందర్భంగా కమల్ సైదా, బ్యాటరీ జానీ, చింతపల్లి గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాలను వినియోగించుకోవాలి : ఎంపీడీవో

మాచవరం, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోర్జంపాడు, మాచవరం సచివాలయాల్లో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాలను వినియోగించుకోవాలని ఎంపీడీవో వెంగళరావు మంగళవారం తెలిపారు. ఈనెల మొదటి విడతలో 5 నుంచి 8వ తేదీ వరకు రెండో విడతలో 12 నుంచి 15వ తేదీ వరకు ఆధార్ కేంద్రాలు నిర్వహిస్తామని తెలియజేశారు. ఈ రెండు కేంద్రాల్లో సేవలను అన్ని గ్రామాల ప్రజలు సద్వినియోగించుకోవాలన్నారు.

భవిత కేంద్రాలను సందర్శించిన కో ఆర్డినేటర్

రెంటచింతల, మే 6 (ఆంధ్రజ్యోతి): రెంటచింతలతో పాటు పశర్లపాడు, కొత్త పాలువాయి, తుమ్మకోటలోని భవిత కేంద్రాలను పల్నాడు జిల్లా సమగ్రశిక్ష కో ఆర్డినేటర్ ఆర్ సెల్వరాజ్ మంగళవారం సందర్శించారు. ప్రభుత్వ పరంగా వివిధ రకాల పరికరాలు అందుతున్నాయా లేదా అని తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రత్యేక అవసరాలు గల పిల్లల గృహాలకు కూడా వెళ్లారు. ఆయన వెంట ఐఈఆర్‌పీ శివారెడ్డి, రాజు, తదితరులున్నారు.

నల్లబ్యాడ్జీలతో ఏఎన్‌ఎంల నిరసన


నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తున్న ఏఎన్‌ఎంలు

రెంటచింతల, మే 6 (ఆంధ్రజ్యోతి): ఏఎన్‌ఎంలు, హెల్త్ సూపర్‌వైజర్లపై ఎంఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర నేతలు చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా మంగళవారం రెంటచింతల పీహెచ్‌సీలో సంబంధిత సిబ్బంది నల్లబ్యాడ్జీలను ధరించి నిరసన వ్యక్తం చేసి అనంతరం డాక్టర్ కృష్ణారెడ్డికి వినతిని అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నేత కోటేశ్వరరావు మాట్లాడుతూ తమ డిమాండ్ల సాధన కోసం సమ్మెలో ఉన్న ఉద్యోగులు తామే గొప్పంటూ సాటి ఉద్యోగుల ను తక్కువ చేసి మాట్లాడం తగదని హితవు పలికారు. రాష్ట్ర నేతలు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో శర్మ, ఆంజనేయులు, సూపర్‌వైజర్లు ప్రసన్న, నిర్మల, ప్రమీల, విజయలక్ష్మి, రమాదేవి, అంజలి, సౌభాగ్యవతి ఆశా కార్యకర్తలు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ కార్యాలయానికి కంప్యూటర్ బహూకరణ

● ఎమ్మెల్యే యరపతినేని చేతుల మీదుగా సెక్రటరీకి అందజేత


ఎన్ఆర్ఐ వెంకట నాగేశ్వరరావు బహూకరించిన కంప్యూటర్‌ను పంచాయతీ సెక్రటరీకి అందజేసిన ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

మాచవరం, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పిల్లుట్ల గ్రామ పంచాయతీకి పరిపాలన రీత్యా అవసరమైన కంప్యూటర్‌ను గ్రామానికి చెందిన పలిశెట్టి వెంకట నాగేశ్వరరావు బహూకరించారు. ఈ కంప్యూటర్‌ను ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు చేతుల మీదుగా పంచాయతీ సెక్రటరీ ప్రసాదుకు అందజేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావును ఎమ్మెల్యే అభినందించారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు హైదరాబాద్, బెంగళూరు, చెన్నై ప్రాంతాల్లో స్థిర పడిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు వారి వారి గ్రామాలకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ బడిగుంచల వెంకటేశ్వర్లు, ఎంపీడీవో వెంగళరావు, ఎంఈవో శ్రీధర్, సర్పంచ్ శివ పార్వతి సాంబశివరావు, మాజీ ఎంపీటీసీ బాహాటం సత్యనారాయణరాజు, పలిశెట్టి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

జంగా కీర్తనకు ప్రభుత్వ పరంగా చేయూతనిస్తాం

● ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

నకరికల్లు, మే 6 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్ష ఫలితాల్లో షైనింగ్ స్టార్ అవార్డు గ్రహీత జంగా కీర్తనకు ప్రభుత్వ పరంగా అందాల్సిన ప్రోత్సాహకాలను అందించే విధంగా చేయూతనిస్తామని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం దేచవరం మోడల్ స్కూల్లో చదివిన జంగా కీర్తన తన తండ్రి జంగా బ్రహ్మయ్యతో కలసి సత్తెనపల్లిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయనను కలిశారు. కీర్తనను కన్నా శాలువాతో సత్కరించి అభినందించారు. ప్రభుత్వ పరంగా అన్ని విధాలా ఆదుకుంటామని తెలిపారు.


జంగా కీర్తనను అభినందించిన కన్నా లక్ష్మీనారాయణ

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించాలి

● విద్యుత్ శాఖ ఎస్ఈ డాక్టర్ విజయకుమార్


సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్ఈ డాక్టర్ విజయకుమార్

మాచర్ల రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించాలని విద్యుత్ శాఖ ఎస్ఈ డాక్టర్ ప్రత్తిపాటి విజయకుమార్ సిబ్బందికి సూచించారు. మంగళవారం మండల పరిధిలోని నాగార్జున సాగర్ ప్రాజెక్ట్, తాళ్లపల్లి, జమ్మలమడక, గన్నవరం గ్రామాల్లోని 33బై11కేవీ సబ్‌స్టేషన్లను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. 11కేవీ ఫీడర్స్ ట్రిప్పింగ్, బ్రేక్‌డౌన్లను తగ్గించి వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలని ఆదేశించారు. మాచర్ల పట్టణంలోని స్పెషల్ డ్రైవ్ ప్రోగ్రామైన ఎఫ్ క్లాస్ల డి లిస్టులను తనిఖీ చేశారు. అలాగే ఈఆర్‌వో కార్యాలయం పరిశీలించి ప్రతినెలా 100 శాతం కలెక్షన్ వచ్చేలా సూచనలు చేశారు. ఎస్ఈ వెంట ఈఈ నూతలపాటి సింగరయ్య, డీఈఈ రామయ్య, సీహెచ్ కోటేశ్వరరావు, శ్రీశైలం, రామేశ్వరరావు నాయక్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మంచి ఫలితాలు : డీవైఈవో


ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సన్మానించిన విద్యాశాఖ అధికారులు, గ్రామస్థులు

నకరికల్లు, మే 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తున్నారని సత్తెనపల్లి డిప్యూటీ డీఈవో ఏసుబాబు అన్నారు. మంగళవారం కుంకలగుంట జడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో ఐదు వందలకు పైగా మార్కులు సాధించిన 13 మంది విద్యార్థులను విద్యాశాఖ అధికారులు, గ్రామస్థులు ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయుడు శ్రీహరి ప్రసాదు రూ.20 వేలు నగదు బహుమతిని అందించారు. నాజ్ ఫౌండేషన్ ఫర్ ఎడ్యుకేషన్ గుంటూరుకు చెందిన లాల్ అహమ్మద్ రూ.6వేలు నగదు, ఉపసర్పంచ్ సింగరాజు అంకారావు రూ.5 వేలు నగదును అందజేశారు. పాఠశాల పూర్వ విద్యార్థి తెలగమనేని సాయిబాబా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సింగరాజు అంకారావు, ఎంఈవో ఎంఎల్ఎన్ ప్రసాదు, హెచ్ఎం కే మేరీరాణి, ఎస్ఎంసీ చైర్మన్ రామిశెట్టి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, మే 6 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో మంగళవారం 22.79 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. లీకుల ద్వారా మూడు వందల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుందన్నారు.


పిడుగురాళ్లలో కొన్నేళ్లుగా మూతపడి ఉన్న బాయిల్డ్ రైస్‌మిల్

- పదేళ్ల క్రితం ఓ వెలుగు వెలిగిన మిల్లులు
- వ్యాపారం లేక మూతపడిన వైనం
- ఇతర రాష్ట్రాల్లో ఏర్పాటుతో తీవ్ర పోటీ..
- పిడుగురాళ్లలో వెయ్యి మందికిపైగా ఉపాధి
- నేడు శిథిలావస్థకు.. తుప్పుపడుతున్న యంత్రాలు

బాయిల్డ్ రైస్ మిల్లులకు.. గ్రహణం


పిడుగురాళ్లలో పిచ్చి చెట్ల మధ్య శిథిలమవుతున్న బాయిల్డ్ యంత్రం

పిడుగురాళ్ల, మే 6 (ఆంధ్రజ్యోతి): పల్నాడు ప్రాంతంలో పిడుగురాళ్ల అంటే తెలియనివారు ఉండరు.. సున్నం పరిశ్రమలతో లైమ్ సిటీగా పేరొంది... బాయిల్డ్ రైస్ మిల్లుల రంగంలో ఒక ముద్ర వేసుకుంది. వేలాది మందికి ఉపాధి చూపిన బాయిల్డ్ రైస్ మిల్లులు నేడు వెలవెలబోతున్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఇక్కడ పదేళ్ల క్రితం వరకు 15 వరకు అతిపెద్ద బాయిల్డ్ రైస్ మిల్లులు పనిచేశాయి. రబీ సాగులో ధాన్యాన్ని వ్యాపారులు కొనుగోలు చేసి.. బాయిల్డ్ రైస్‌గా రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలతో పాటు కేరళ, తమిళనాడుకు సరఫరా చేసే వారు. బాయిల్డ్ రైస్‌ను ప్రభుత్వం తీసుకోకపోవడం, వర్షాభావ ప్రభావం వల్ల పల్నాడు ప్రాంతంతో పాటు పలు ప్రాంతాల్లో రెండవ పంటగా వరి సాగు లేకపోవడంతో క్రమ క్రమంగా బాయిల్డ్ రైస్ మిల్లులకు గ్రహణం పట్టింది.

ఇతర రాష్ట్రాల్లో బాయిల్డ్ రైస్ మిల్లులు..

సగం విరిగిన ధాన్యాన్ని బాయిల్డ్ రైస్‌కు ఉపయోగించే వారు. బోర్లు, బావులతో సాగునీరు పుష్కలంగా అందుతుండటంతో వరి ధాన్యం దిగుబడి నాణ్యత బాగుంటోంది. అవి బాయిల్డ్ రైస్‌గా ఉపయోగించేందుకు వీలుపడటం లేదు. కాలానుగుణంగా తూర్పు గోదావరి జిల్లా, తెలంగాణలోని మిర్యాలగూడలో విస్తారంగా బాయిల్డ్ రైస్ మిల్లులు ఏర్పడటంతో పిడుగురాళ్లలో బాయిల్డ్ రైస్ మిల్లులు వెనుకబడ్డాయి. ఒకప్పుడు పిడుగురాళ్లలో బాయిల్డ్ రైస్‌మిల్లులు పనిచేసిన సమయంలో పిడుగురాళ్ల, జానపాడుతో పాటు సమీప గ్రామాల్లోని పురుషులు, మహిళలకు ఒక్కో మిల్లులో రోజుకు 100 మంది వరకు ఉపాధి లభించేది. కేరళ, తమిళనాడులో కూడా అక్కడ రైతులు పండించిన ధాన్యాన్నే ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. ఫలితంగా పిడుగురాళ్లలో ఒకప్పుడు కళకళలాడిన బాయిల్డ్ రైస్ మిల్లులు నేడు వెలవెలబోతున్నాయి. రూ.లక్షల ఖరీదు చేసే బాయిల్డ్ యంత్రాలు, మిల్లుల్లో సామగ్రి అంతా తుప్పుపడుతున్నాయి. ఆ యంత్రాలను మరొకరికి విక్రయించేందుకు వ్యాపారులు సిద్ధంగా ఉన్నప్పటికీ నేటి టెక్నాలజీకి అనుగుణంగా తయారైన యంత్రాలనే ఇప్పటి వ్యాపారులు కొనుగోలు చేస్తుండటంతో.. భారీ యంత్రాలన్నీ నిరుపయోగంగా పడిఉన్నాయి.

ఆనాటి కళ ఇక రాదు

-కట్టమూరి శంకరరావు, వ్యాపారి



దాదాపు పదేళ్ల క్రితం రోజుకు వెయ్యి మందికి పైగా పిడుగురాళ్లలో ఉపాధి లభించే అవకాశం ఒక్క బాయిల్డ్ రైస్ మిల్లులకే ఉండేది. వ్యాపారులకు తగిన ఆదాయం, స్థానికులకు ఉపాధి చూపించామన్న సంతృప్తి ఉండేది. బాయిల్డ్ రైస్ మిల్లులు సమీప జిల్లా అయిన మిర్యాలగూడ, పొరుగు రాష్ట్రాలలో ఏర్పడటంతో క్రమ క్రమంగా పిడుగురాళ్లలో బాయిల్డ్ రైస్ మిల్లులన్నీ మూత పడ్డాయి.

సాగుకు పరీక్ష

వ్యవసాయరంగాన్ని నమ్ముకున్న రైతులకు నానాటికి పెట్టుబడులు పెరగడం తప్ప.. దిగుబడులు ఆశించినంత స్థాయిలో రావడంలేదు. ఫలితంగా నష్టాలబారిన పడటమో లేదా పెట్టుబడికి తగ్గ దిగ్గుబడితో సరిపుచ్చుకోవడమో జరుగుతుంది. అందుకు ప్రధాన కారణంగా పంట వేసే ముందు భూసార పరీక్షలు పూర్తి స్థాయిలో జరపకపోవడమేనని పలువురు వ్యవసాయరంగ నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.


దుక్కు దున్ని ఉన్న పంటపొలం

- సకాలంలో నిర్వహించని భూసార పరీక్షలు
- వ్యవసాయశాఖ నిర్లిప్తతో రైతులకు నష్టం
- పెరుగుతున్న పెట్టుబడులు, దిగజారుతున్న దిగుబడులు
- పోషకాల లోపమే అంటున్న నిపుణులు
- తొలిదశలో గుర్తించకపోవడంతో.. అధికంగా ఎరువుల వినియోగం
- డెల్టాలో ఖరీఫ్, రబీలో వేర్వేరు పంటల సాగు
- ప్రస్తుతం దుక్కులు సిద్ధం చేస్తున్నరైతులు

తెనాలిరూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): తెనాలి ప్రాంతంలో అధికంగా రైతు కుటుంబాలే తర తరాల నుండి వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. ఇందులో ఎక్కువగా నిరక్షరాస్యులే ఉండటం విశేషం. ఈ ప్రాంతంలో ఏడాదికి రెండు పంటలు పండే వీలుంది. ఖరీఫ్, రబీ సీజన్లలో వరి, జొన్న, మొక్కజొన్న వంటి పంటలు సాగు చేస్తుంటారు. గతంలో ఎకరాకు 40-50 బస్తాలకుపైగా ధాన్యం పండేది. రాను రాను దిగుబడులు తగ్గి.. పెట్టుబడులు పెరిగాయి. యూరియా, డీఏపీ వంటి ఎరువులు గతంలో తక్కువగా వినియోగిస్తేనే పంటల ఎదుగుదల చక్కగా ఉండేది. ఎరువుల వాడకం పెరడంతో.. దిగుబడి తగ్గడంతో పాటు చీడపీడల వ్యాప్తికూడా పెరుగుతోంది. ఇందుకు ప్రధానంగా భూమిలో పోషకలోపాలను తొలిదశలోనే గుర్తించకపోవడమేనని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

సాగుకు ముందే భూసార పరీక్షలు తప్పనిసరి

దుక్కి సమయంలో సాగు భూమి మధ్య నుండి కొంత మట్టిని నమూనాగా తీసుకుని.. దానిని సాలిడ్ టెస్టింగ్ ల్యాబ్‌కు పంపాలి. అప్పుడే భూమిలోని పోషక లోపాలు, విలువలు గుర్తించడంతో పాటు పంటల సాగుకు అనువైన విత్తన రకాలనూ తెలుసుకోనే అవకాశం ఉంటుంది. పోషక లోపాలు గుర్తిస్తే.. నివారణకు అవసరమైన చర్యలు చేపట్టవచ్చు. గతంలో జింక్ లోపాన్ని గుర్తించి.. నివారణకు అధికంగా జింక్‌ను రైతులు వినియోగించారు. ప్రస్తుతం సాగు పూర్తిచేసుకున్న రైతులు దుక్కులు దున్ని.. భూములు పదును పెట్టుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఇప్పటి నుంచే వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు భూసార పరీక్షలపై అవగాహన కల్పించి, శాంపిల్స్ పరీక్షలు చేయించి, లోపాలను తెలుసుకోవాలి. రైతులకు సస్యరక్షణ చర్యలను వివరించాలి.

రైతు సేవా కేంద్రాల్లో భూసార పరీక్షలు..

రైతు సేవా కేంద్రాల వద్దే భూసార పరీక్షలు ఏర్పాటు చేస్తే రైతులకు మేలు జరుగుతుంది. ఎప్పటికప్పుడు పరీక్షలు జరిపి లోపాలను వెంటనే తెలిపే అవకాశం ఉంటుంది. దీని ద్వారా తక్షణమే సస్యరక్షణ చర్యలు చేపడితే రాబోయే పంట సాగుకు పూర్తిగా పెట్టుబడులు తగ్గడంతో పాటు అనువైన విత్తనాన్ని ఎంపిక చేసుకునే అవకాశం ఉంటుంది.

తూతూ మంత్రంగా భూసార పరీక్షలు

గత వైసీపీ ప్రభుత్వంలో భూసార పరీక్షలు తూతూ మంత్రంగానే జరిగాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి.. సేవలు మాత్రం అంతంతమాత్రంగానే ఉంచిందన్న విమర్శలున్నాయి. వ్యవసాయానికి ప్రధాన భూమిక పోషించే సాలిడ్ టెస్ట్‌లను ఆర్బీకేల్లో ఏర్పాటు చేయకపోవడంతో రైతులకు భూసారం గురించి తెలుసుకునేందుకు అవకాశం తక్కువగా ఉండేది. సాగు సమయం ఆసన్నమయ్యే సమయంలో వ్యవసాయశాఖ సిబ్బంది హడావుడి చేసి స్వల్ప సంఖ్యలోనే శాంపిల్స్ తీసుకునే వారని రైతులు చెబుతున్నారు. వాటిని జిల్లా సాలిడ్ టెస్టింగ్ ల్యాబ్‌కు పంపేవారని..ఫలితాలు వచ్చేసరికి సాగుపనులు కూడా ప్రారంభమయ్యేవని అంటున్నారు. దీంతో పరీక్షలకు మట్టి తీసుకున్నా రైతాంగానికి మేలు జరిగిందేమిలేదన్న విమర్శలున్నాయి.

చిక్కడు, దొరకడు.. చిన్నోడు!

● నియోజకవర్గాన్ని విడిచి పరారై సంవత్సరం ● అజ్ఞాతంలో మాజీ ఎమ్మెల్యే సోదరుడు ● అన్న జన్మదిన వేడుకల్లో ప్రత్యక్షం

మాచర్లటౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి): మాచర్ల నియోజకవర్గాన్ని వైసీపీ ప్రభుత్వ హయాంలో టెర్రరైజ్ చేసి, అన్నీ తానై అన్నను మించి షాడోగా సాగించుకున్న పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి (చిన్నోడు) నియోజకవర్గానికి మొహం చాటేసి సంవత్సరం కావొస్తోంది. మాజోలికి వచ్చే దెవరు.. మాజోలికొచ్చి తట్టుకునేదెవరూ అంటూ ప్రగల్భాలు పలికిన వ్యక్తి.. తెలంగాణలో తలదాచుకొని వ్యాపారాలు చేసుకుంటూ.. ఆదాయాన్ని గడిస్తున్నాడు. పాపం ఆయనను నమ్ముకున్న చోటా మోటా నాయకులు, కార్యకర్తలు కొంతమంది జైలుపాలు కాగా, మరికొంతమంది ఇతర రాష్ట్రాల్లో అజ్ఞాత జీవితం గడుపుతున్నారు.

హౌస్ అరెస్ట్ నుంచి పరారై..

ఎన్నికల పోలింగ్, మరుసటి రోజు జరిగిన దాడుల్లో గతేడాది మే 14న పోలీసులు మాచర్లలో పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిని హౌస్ అరెస్ట్ చేశారు. పోలీసుల కన్నుగప్పి అర్ధరాత్రి వేళ పీవీఆర్ పరారై నేటికి సుమారు ఏడాది కావొస్తోంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు మాచర్ల నియోజకవర్గంలో అడుగు పెట్టలేదు. తనను నమ్ముకున్న కార్యకర్తలకు కూడా తాను ఎక్కడ ఉన్నాడో చెప్పకుండా అజ్ఞాత జీవితాన్ని కొనసాగిస్తున్నాడు. తన ఆధిపత్యంలో సహకరించిన నాయకులు, కార్యకర్తలు కొంతమంది జైలుపాలు కాగా, మరికొంతమంది నియోజకవర్గం విడిచి పొరుగు రాష్ట్రాల్లో తలదాచుకుంటున్నారు. అధికారంలో ఉన్నప్పుడు అప్పటి ప్రతిపక్ష నాయకుడు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మానందరెడ్డిని ఎన్నికల్లో ఓడిపోతే నియోజకవర్గం వదిలిపెట్టి పోతాడని తూలనాడిన వెంకట్రామిరెడ్డి... నేడు వైసీపీ అధికారం కోల్పోవడంతో మాచర్ల నియోజకవర్గంలోకి అడుగు పెట్టడానికి కూడా సాహసం చేయలేకపోతున్నాడు. అంగ బలం, అర్థబలంతో తనపై నమోదైన కేసులన్నింటిపై కోర్టుకెళ్లి బెయిల్ పొందగలిగాడు. నమ్ముకున్న వారు మాత్రం డబ్బుల్లేక, కుటుంబ పోషణ భారమై నరకయాతన పడుతున్నారు.

పోలీసులు ఉదాసీన వైఖరితో..

ఈ మధ్యన విడుదలైన పుష్ప-2 సినిమాలో.. హీరో దమ్ముంటే పట్టుకోరా షెకావత్ అంటూ.. పోలీసు ఆఫీసర్‌కు సవాల్ విసిరే సన్నివేశం ప్రేక్షకులను ఆకట్టుకుంది. మాచర్లలో అదే స్థాయిలో పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి పలు కేసుల్లో నిందితుడు అయినప్పటికీ పోలీసులకు చిక్కకుండా సవాల్ విసురుతున్నారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరినా..వెంకట్రామిరెడ్డి వ్యవహారంలో మాచర్ల పోలీసులు ఉదాసీనత వైఖరిని అవలంబించారని విమర్శలు వస్తున్నాయి. గత ఫిబ్రవరి 15న తన సోదరుడు, మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి జన్మదినం సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన వేడుకల్లో మొదటి సారిగా ప్రత్యక్షమయ్యాడు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని అనేక వ్యాపారాలు చేసి, కూడబెట్టుకున్న ఆస్తులతో పోలీసులు తన జోలికి రాకుండా చేసుకోవడంలో ఆయన విజయవంతం కాగలిగాడు.



12 కేసుల్లో నాలుగు 307 సెక్షన్లు..

- గతేడాది మే 13న సాధారణ ఎన్నికల ఓటింగ్ జరిగింది. ఆ సమయంలో పోలింగ్ బూత్‌ల వద్ద దాడులు చేయడం, మరుసటి రోజు కారంపూడిలో కార్యకర్తలతో టీడీపీ కార్యాలయం, నాయకుల ఆస్తులను ధ్వంసం చేశారు. అడ్డుకున్న సీఐ నారాయణ స్వామిపై దాడి చేసి, గాయపరచడం వంటి పలు కేసుల్లో 12 కేసులు నమోదయ్యాయి. ఇందులో నాలుగు 307 సెక్షన్ కింద కేసులు నమోదయ్యాయి.
- 2022 డిసెంబరు 16న మాచర్ల పట్టణంలో టీడీపీ కార్యాలయం, నాయకుల గృహాలు ధ్వంసం, కార్లకు నిప్పు పెట్టడం వంటి కేసుల్లో పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిపై 307 కేసు నమోదైంది. ఎన్నికల ఓటింగ్ రోజున వెల్దుర్తి మండలం కండ్లకుంటలో ఏజెంట్‌గా కూర్చున్న నోముల మాణిక్యంను బెదిరించిన కేసులో ఎస్సీ, ఎస్టీ కేసు కూడా నమోదు చేశారు.
- అదే రోజు పట్టణంలోని పీడబ్ల్యూడీ కాలనీలో టీడీపీ నేత యెనుముల కేశవరెడ్డి గృహంపై దాడి చేసి, ధ్వంసం చేయడంతో పాటు సుమారు 12 మంది కార్యకర్తలను కారుతో ఢీకొట్టి గాయపరిచారు. వాహనాలను ధ్వంసం చేయడంతో 307 నమోదైంది.
- 2014లో మాచవరం మండలం చెన్నాయపాలెంలో సరస్వతీ సిమెంట్స్‌కి భూములు ఇచ్చిన రైతులపై దాడి కేసులో 307తోపాటు ఎస్సీ, ఎస్టీ కేసులో నిందితుడిగా వెంకట్రామిరెడ్డి ఉన్నారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణానికి సహకరించాలి

● గుంటూరు, బాపట్ల జిల్లాల అధికారులతో ఎంపీ కృష్ణప్రసాదు

గుంటూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు నుంచి నిజాంపట్నం పోర్టు వరకు కొత్తగా(గ్రీన్ ఫీల్డ్) నాలుగు వరసల రోడ్డు నిర్మాణానికి సంబంధిత ప్రభుత్వ శాఖలు సహకరించాలని బాపట్ల ఎంపీ టి.కృష్ణప్రసాదు విజ్ఞప్తి చేశారు. మంగళవారం సాయంత్రం ఈ హైవే ప్రాజెక్టుపై సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులతో ఆయన గుంటూరు కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, బాపట్ల కలెక్టర్ జె.వెంకట మురళి, గుంటూరు జేసీ ఎ.భార్గవ్ తేజ, ఎమ్మెల్యేలు నక్కా ఆనందబాబు, వేగేశన నరేంద్ర వర్మ, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సిన్హా, జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు నుంచి నిజాంపట్నం పోర్ట్ వరకు కొత్తగా (గ్రీన్‌ఫీల్డ్) నాలుగు వరసల హైవేని 47.848 కిలోమీటర్ల పొడవునా నిర్మాణం చేయాల్సి ఉందన్నారు. ఈ రహదారి నిర్మాణానికి సంబంధిత కేంద్రమంత్రులతో అనేక దఫాలు చర్చించి, వారిని ఒప్పించి ప్రాజెక్టుని మంజూరు చేయించడం జరిగిందన్నారు. ఈ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి అయితే సూర్యలంక, చీరాల బీచ్‌తో పాటు అనేక ఆధ్యాత్మిక ప్రదేశాలు, పొన్నూరులోని వీరాంజనేయ స్వామి దేవస్థానం పర్యటకాభివృద్ధి చెందుతా యన్నారు. రోడ్డు నిర్మాణ పనులకు అన్ని అనుమతులు పొందిన తర్వాత ఆరు నెలల్లో భూసేకరణ, 18 నెలల్లోపు రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చే యాలని తన ఆకాంక్షను తెలిపారు. స్టేక్ హోల్డర్స్ అయిన ఆర్అండ్‌బీ, విద్యు త్, ఇరిగేషన్, రైల్వే, ఫిషరీస్, అగ్రికల్చర్, పంచాయతీ రాజ్, దేవదాయ, అటవీశాఖ అధికారులు తమ శాఖలకు సంబంధించి ఏవైనా అంశాలు ఉంటే పూర్తి వివరాలతో శుక్రవారం సాయంత్రంలోపు అందించాలని కలెక్టర్లు నాగ లక్ష్మి, జె.వెంకట మురళి ఆదేశించారు. వాటిని క్రోడీకరించి ప్రాజెక్టు రిపోర్ట్‌ను నేషనల్ హైవే అథారిటీకి పంపి, రోడ్డు నిర్మాణానికి అనుమతులు కోరడం జరుగుతుందన్నారు. పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా నేషనల్ హైవే అథారిటీ అధికారులు రోడ్డు నిర్మాణాన్ని వివరించారు. ఎన్‌హెచ్ఏఐ ప్రాజెక్టు అధికారి పార్వతీశం, డీఆర్ఓ ఎస్ఎస్‌కే ఖాజావలి, పంచాయతీ రాజ్ ఎస్ఈ బ్రహ్మయ్య, డీపీఓ నాగసాయికుమార్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


స్టేక్‌హోల్డర్స్ సమావేశంలో పాల్గొన్న బాపట్ల ఎంపీ కృష్ణ ప్రసాదు, ఎమ్మెల్యేలు నక్కా ఆనందబాబు, వేగేశన నరేంద్రవర్మ బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకటమురళి తదితరులు

9 వరకే మిర్చి యార్డులో లావాదేవీలు

● సెలక్షన్ గ్రేడ్ సెక్రెటరీ చంద్రిక

గుంటూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): ఎండల తీవ్రత దృష్ట్యా మిర్చి యార్డుకు ఈ నెల 12వ తేదీ నుంచి వేసవి సెలవులు ప్రకటిస్తున్నట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హమాలీల యూనియన్లు, చిల్లీస్ మర్చంట్స్ అసోసియేషన్ విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. యార్డులో 9వ తేదీ శుక్రవారం వరకే మిర్చి లావాదేవీలు జరుగుతాయన్నారు. శని, ఆదివారాలు యార్డుకు సెలవుదినాలని పేర్కొన్నారు. జూన్ 9 నుంచి యథావిధిగా క్రయ విక్రయాలు జరుగుతాయని తెలిపారు. రైతులు 8న సాయంత్రం నుంచి సరుకుని యార్డుకు తీసుకురావొచ్చని పేర్కొన్నారు.

డీఎస్సీ అభ్యర్థులకు ప్రత్యేక హెల్ప్‌లైన్

గుంటూరు(విద్య),మే 6(ఆంధ్రజ్యోతి): త్వరలో నిర్వహించనున్న మెగా డీఎస్సీకి హాజరయ్యే అభ్యర్థుల కోసం ప్రత్యేక హెల్ప్ లైన్ కేంద్రాన్ని పాఠశాల విద్యాశాఖ ఏర్పాటు చేసింది. జిల్లాల వారీగా ప్రత్యేక హెల్ప్‌లైన్ కేంద్రాలు ఏర్పాటు చేసి, అభ్యర్థుల సందేహాలు నివృత్తిచేయనుంది. ఉమ్మడి గుంటూరు జిల్లాకు 95733 82626, 92467 63763లో సంప్రదించాలని పేర్కొంది.

ఇంజనీరింగ్ అధికారులపై..
క్రమశిక్షణ చర్యలు

● నరుకుళ్లపాడు మేజర్ కాలువ పనుల్లో నాణ్యత లోపం ● విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సమగ్ర నివేదిక ● ప్రాథమిక ఆధారాలను గుర్తించిన జలవనరుల శాఖ

గుంటూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్టు పరిధిలోని నరుకుళ్లపాడు మేజర్ కాల్వ పనుల్లో నాణ్యత లోపంపై జలవనరుల శాఖ ప్రాథమిక ఆధారాలను గుర్తించింది. ఇందుకు బాధ్యులైన అధికారులపై శాఖపరమైన చర్యలకు ఆదేశాలు జారీ చేసింది. తాడికొండ నియోజకవర్గం పరిధిలో జరిగిన ఈ పనుల విషయంలో పలువురు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, డీఈఈ, ఏఈఈల పాత్ర ఉన్నట్లు అంచనాకు వచ్చింది. వీళ్లల్లో కొందరు వేరే జిల్లాల్లో ప్రస్తుతం విధులు నిర్వహిస్తుండగా.. ఒకరిద్దరు రాష్ట్ర విభజన సమయంలో తెలంగాణ క్యాడర్‌కు వెళ్లిపోయారు. అయినప్పటికీ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. అవసరమైతే మేజర్ పెనాల్టీలు కూడా విధించేందుకు ప్రొసీడింగ్స్ జారీ చేసింది. ప్రభుత్వ నిర్ణయంతో ఆయా అధికారుల్లో ఆందోళన మొదలైంది.

నాగార్జున సాగర్ కుడి కాల్వ ఆధునికీకరణ పనులు ఉమ్మడి రాష్ట్రంలో పెద్దఎత్తున చేపట్టారు. కాల్వల వెడల్పు, గట్ల బలోపేతం, కొత్త రెగ్యులేటర్లు, వంతెనలు నిర్మించడం వంటి అనేక పనులు చేశారు. నరుకుళ్లపాడు మేజర్ కాల్వ పనులను తాడికొండ నియోజకవర్గంలో అప్పటి ఈఈ జి.వాసంతి (ప్రస్తుతం తెలంగాణలోని బాన్సువాడ ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ), డీఈఈ అనురాధ(కురిచేడు సబ్ డివిజన్ మానిటరింగ్ డీఈఈ), ఏఈఈ సీహెచ్ చిన్నరాణి(ముప్పాళ్ల), డీఈఈ టీ రమేష్(వీపీ సబ్ డివిజన్ నంబరు 2 గుంటూరు), ఏఈఈ కె.రామకృష్ణ(ఎన్ఎస్‌జేసీ ఓఅండ్ఎం సెక్షన్ నకరికల్లు), ఈఈ పీవీఎస్‌వీ ప్రసాదరావు (రిటైర్డు), ఈఈ ఎంవీ కృష్ణారావు(రిటైర్డు), ఇన్‌చార్జి ఈఈ ఎంఎస్‌వీకేఎస్ రాంప్రసాదు (రిటైర్డు), ఈఈ బీఎస్‌వీ ప్రసాదరావు(రిటైర్డు) పర్యవేక్షించారు.

పనులు జరిగిన కొన్ని నెలల్లో అవి శిథిలం కావడంతో ప్రభుత్వానికి పెద్దఎత్తున ఫిర్యాదులు వెళ్లాయి. దీనిపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రాంతీయ కార్యాలయం అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపారు. పనుల్లో నాణ్యత లోపాన్ని ధ్రువీకరించి, వాటిని ఎవరెవరు పర్యవేక్షించారనే వివరాలను సేకరించి ప్రభుత్వానికి సమగ్ర నివేదిక అందజేశారు. ఈ నివేదికను జలవనరుల శాఖ క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం.. అధికారుల పర్యవేక్షణ లోపంపై ప్రాథమిక ఆధారాలున్నట్లుగా నిర్ధారించుకుంది. శాఖపరమైన చర్యలకు ఉపక్రమించింది. ఈ మేరకు మంగళవారం జలవనరుల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.


ఎడ్ల పోటీలను ప్రారంభిస్తున్న మంత్రులు అనగాని, గొట్టిపాటి, ఎంపీ కృష్ణ ప్రసాద్, ఎమ్మెల్యే నరేంద్ర


బహుమతి ప్రదానం చేస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యేలు ధూళిపాళ్ల నరేంద్ర, గల్లా మాధవి

పౌరుషానికి ప్రతీక ఒంగోలు జాతి ఎడ్లు

● ఎడ్ల బల ప్రదర్శనలో రాష్ట్ర మంత్రులు

పొన్నూరుటౌన్. మే 6(ఆంధ్రజ్యోతి): తెలుగు జాతి పౌరుషానికి ఒంగోలు జాతి ఎడ్లు ప్రతీక అని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడిలో ధూళిపాళ్ల వీరయ్య చౌదరి మెమోరియల్ జాతీయస్థాయి వృషభరాజాల బల ప్రదర్శన పోటీలు మంగళవారం జరిగాయి. రాష్ట్ర మంత్రులు నాదెండ్ల, అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్, పలువురు ప్రజా ప్రతినిధులు పోటీలను ప్రారంభించి రైతులను సన్మానించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. సబ్ జూనియర్స్ విభాగంలో 9 జతల ఎడ్లు 1,600 కిలోల బండ లాగుడు పోటీల్లో తలపడ్డాయి. ఈ సందర్భంగా సభలో మంత్రులు మాట్లాడుతూ.. భారీ స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బల ప్రదర్శన రాష్ట్రానికే ఆకర్షణగా మారిందన్నారు. ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ తండ్రి ధూళిపాళ్ల వీరయ్య చౌదరి ఆశయాలతో సంగం డెయిరీని మరో మెట్టు ఎక్కించి రైతులకు మేలు చేస్తున్నారని కొనియాడారు. వైసీపీ పాలకులు డెయిరీని నిర్వీర్యం చేసేందుకు కుట్రలు పన్ని, ఇబ్బందులకు గురిచేసినా.. జైలు జీవితం ఎదుర్కొన్నారే కానీ, దుర్మార్గాలకు లొంగలేదన్నారు. గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, గుంటూరు మేయర్ కోవెలమూడి రవీంద్ర, ఇండస్ట్రియల్ కార్పొరేషన్ చైర్మన్ మంతెన రామరాజు, విజయనగరం మాజీ ఎమ్మెల్యే గంపా కృష్ణ, మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, బీజేపీ అధికార ప్రతినిధి పాతూరి నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆర్టీసీ జిల్లా డిస్పెన్సరీ నూతన భవనం ప్రారంభం

నరసరావుపేట టౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీ పల్నాడు జిల్లా డిస్పెన్సరీ నూతన భవనం ప్రారంభోత్సవం బుధవారం ఉదయం 10.30 గంటలకు జరుగుతుందని జిల్లా ప్రజారవాణా కార్యాలయం అధికారి ప్రసాదు మంగళవారం తెలిపారు. రాష్ట్ర రవాణా, యువజన వ్యవహారాలు, క్రీడలు శాఖ మంత్రి ఎం రామ్‌ప్రసాదరెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. ఆర్టీసీ చైర్మన్ కొనగళ్ళ నారాయణరావు, జోనల్ చైర్మన్ ఎస్ సురేష్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఆర్టీసీ ఎండీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు రానున్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట



శ్రీ భీమలింగేశ్వర స్వామి మూలవిరాట్

11న శ్రీ భీమలింగేశ్వరస్వామి రథోత్సవం

● 10న స్వామి వారి కల్యాణం

నరసరావుపేట, మే 6 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పాతూరులోని శ్రీగంగా పార్వతి సమేత భీమలింగేశ్వరస్వామి రథోత్సవం 11న నిర్వహిస్తున్నట్టు దేవస్థానం ఈవో శ్యామల రఘునాథరెడ్డి మంగళవారం తెలిపారు. అలాగే స్వామివారి కల్యాణోత్సం 10న శనివారం సాయంత్రం జరుపుతున్నామని చెప్పారు. శుక్రవారం గణపతి పూజతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. నూతనంగా నిర్మించిన రథంతో భీమలింగేశ్వర స్వామి రథోత్సవం ఆదివారం ఉదయం పట్టణ పురవీధుల్లో జరగుతుందని చెప్పారు. 50 ఏళ్ల అనంతరం మళ్లీ రథోత్సవం జరుగనున్నదని ఈవో పేర్కొన్నారు. రథోత్సవంలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పాల్గొంటారని తెలిపారు. స్వామివారి కల్యాణోత్సం.. రథోత్సవంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని ఈవో కోరారు.

తాటి చెట్టు పైనుంచి పడి యువకుడికి గాయాలు

చిలకలూరిపేట, మే 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బొందిలిపాలెం ఓగేరు వాగు సమీపంలో మంగళవారం ఒక యువకుడు తాటి చెట్టు పైనుంచి కిందపడి తీవ్రంగా గాయపడిన సంఘటన జరిగింది. పట్టణానికి చెందిన బాజీ (35) అనే యువకుడు మద్యం సేవించి తాటిచెట్టు ఎక్కాడు. మద్యం మత్తులో పట్టుతప్పి చెట్టు పైనుంచి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గమనించి 108 వాహనం సిబ్బందికి సమాచారం అందించారు. తొలుత అతడిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఆధార్ కేంద్రం ప్రారంభం

రొంపిచర్ల, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిపాలెంలోని విప్పర్ల పీఏసీఎస్ కార్యాలయంలో అంతర్జాతీయ సహకార వారోత్సవాల సందర్భంగా ఆధార్ ఎన్‌రోల్‌మెంట్‌ను నిర్వహిస్తున్నారు. మంగళవారం ఈ కార్యక్రమాన్ని సంతగుడిపాడు జీడీసీసీ బ్యాంక్ మేనేజర్ ఎం.కోటేశ్వరరావు ప్రారంభించారు. శిబిరాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఈదురు గాలులతో వర్షం

రొంపిచర్ల, మే 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గ్రామాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షం మంగళవారం తెల్లవారు జామున కురిసింది. ఈ సందర్భంగా పలు చోట్ల కొమ్మలు విరిగి పడ్డాయి. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. తీగలను సరిచేసి ఆ శాఖ అధికారులు విద్యుత్‌ను పునరుద్ధరించారు.

రాయితీపై పశువుల దాణా

నూజెండ్ల, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులకు 50శాతం రాయితీపై పశువుల దాణాను మంగళవారం పశు వైద్యాధికారి శివాజీ రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ భారత్ పశుధన్ యాప్‌లో రైతులు పేర్లు నమోదు అయి ఉండి తెల్ల రేషన్ కార్డు కలిగిన పాడి రైతులకు రైతు సేవా కేంద్రాల పరిధిలో రోస్టర్ విధానంలో రాయితీపై పశువుల దాణా అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వీర్ల వెంకట స్వామి, టీడీపీ నాయకులు బేతపూడి చిరంజీవి, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరం

వినుకొండ, మే 6 (ఆంధ్రజ్యోతి): పౌర గ్రంథాలయ శాఖ వారి ఆదేశాల మేరకు, ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆదేశాల మేరకు స్థానిక వినుకొండ శాఖ గ్రంథాలయంలో వారం రోజులుగా వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నారు. ఈ వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా మంగళవారం విద్యార్థినీ, విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. అలాగే బుక్ ఎగ్జిబిషన్, యోగా తదితర అంశాలపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి భూక్యా బద్రీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చిలకలూరిపేట, మే 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ లైన్ల మరమ్మతులు, చెట్ల తొలగింపు కారణంగా ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా చేయబడుతుందని విద్యుత్ శాఖ డీఈఈ ఆర్.అశోక్ కుమార్ మంగళవారం తెలిపారు. చిలకలూరిపేట టౌన్-2 పరిధిలోని పురుషోత్తమపట్నం, శాంతినగర్, ఆదిఆంధ్ర కాలనీ, సుగాలీ కాలని, తండ్రి సన్నిధి చర్చి ప్రాంతాల్లో సరఫరా నిలిపివేస్తామన్నారు.

పీఏసీఎస్‌ల కంప్యూటరీకరణ ఆడిట్‌పై శిక్షణ

నరసరావుపేట టౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల కంప్యూటీకరణ చేసిన తర్వాత నిర్వహించవలసిన ఆడిట్‌పై ఈ ఆడిట్ శిక్షణ కార్యక్రమం ఆంధ్రప్రదేశ్ కో ఆపరేటివ్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం నరసరావుపేట కేంద్ర సహకార బ్యాంక్‌లో ఆడిటర్లు, చార్టెడ్ అకౌంటెంట్లు, సంఘాల సీఈవోలకు శిక్షణ మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా సహకార అధికారి ఎం.వెంకటరమణ మాట్లాడుతూ ప్రభుత్వం సహకార సంఘాల ఆధునికీకరణ దిశగా తీసుకుంటున్న చర్యలలో భాగంగా జిల్లాలో ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పీఏసీఎస్)ను ఈ పీఏసీఎస్‌గా మార్చినట్లు తెలిపారు. ప్రతిరోజు నిర్వహించే ప్రక్రియల నుంచి నిర్వహణ వరకు అన్ని కార్యకల్లాపాలు డిజిటల్‌గా చేయనున్నట్లు తెలిపారు. పీఏసీఎస్‌ల ఖాతాల పరిశీలను, లావాదేవీల పరిశీలన, భద్రతా ప్రమాణాలు మొదలైనవి ఆన్‌లైన్ విధానంలో నిర్వహించనున్నామని, దీని వలన పారదర్శకత పెరుగుతుందన్నారు. కేంద్రీకృత నిఘా, నియంత్రణ ఉంటుందని, రాష్ట్ర, జాతీయ స్థాయి నుంచి పీఏసీఎస్‌ల పనితీరుపై నేరుగా పర్యవేక్షణ సాధ్యమవుతుందన్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా సహకార అధికారి ఎం.వెంకటరమణ తదితరులు

జిల్లా సహకార ఆడిట్ అధికారి డీ శ్రీనివాసరావు మాట్లాడుతూ సంఘ లావాదేవీలు, ఖాతాలు, రికార్డులు స్పష్టంగా ఉండి అవినీతి అవకాశాలు తగ్గుతాయని, మానవ దోషాలేమి లేకుండా కంప్యూటరైజ్డ్ విధానంలో త్వరగా ఆడిట్ పూర్తి చేయవచ్చ అన్నారు. ఖచ్చితమైన డేటా నిర్వహణ ఉంటుందని పేర్కొన్నారు. గత ఆడిట్లతో పోలికలు, పేపర్ వాడకం తగ్గి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడుతుందనన్నారు. ఇకపై సంఘ సంఘాలు సభ్యులకు మెరుగైన సేవలు అందించగలమని, తక్కువ సమయంలో ఖాతాలు చూసే రుణ వివరాలు తెలుసుకొనే అవకాశం కలుగుతుందన్నారు. ఈ పీఏసీఎస్, ఈ ఆడిట్ వ్యవస్థలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో కీలకంగా మారుతున్నాయని అన్నారు, ఈ ఆడిట్ ఎలా చేయాలో డిపార్టుమెంట్ సిబ్బందికి, చార్టర్డ్ అకౌంటెంట్స్‌కు శిక్షణ ఇచ్చి వారి సందేహాలను నివృతి చేశారు. కార్యక్రమంలో సహకర శాఖ ఆడిటర్‌లు, సీఏలు, సీఈవోలు పాల్గొన్నారు.

రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలి

డీడీఏ శివకుమారి

యడ్లపాడు, మే 6 (ఆంధ్రజ్యోతి): రైతులందరూ భూసార పరీక్షలు చేయించుకోవాలని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ శివకుమారి అన్నారు. మంగళవారం మండలంలోని జగ్గాపురంలో భూసార పరీక్షల నిమిత్తం మట్టి నమూనాల సేకరణ ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూసార పరీక్షల ఆధారంగా ఎరువులను వాడడం వలన పంట దిగుబడులు పెంచుకునేందుకు అవకాశం ఉంటుందని, అలాగే ఖర్చు తగ్గుతుందన్నారు. ఏప్రిల్, మే నెలల్లో భూసార పరీక్షలు చేయించుకోవడానికి అనువైన సమయమన్నారు. మట్టి నమూనాలు సేకరించాల్సిన ప్రదేశాలు, మట్టిని ఎలా సేకరించాలి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏడీఏ మస్తానమ్మ, ఏవో సరిత, రైతు సేవాకేంద్రం సహాయకులు పాల్గొన్నారు.

● నాదెండ్ల: మట్టి పరీక్షలను నిర్వహించటం ద్వారా రైతులు భూమి నాణ్యతను తెలుసుకోవచ్చని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ శివకుమారి అన్నారు. మండలంలోని గణపవరంలో ఆమెతో పాటు ఏడీఏ మస్తానమ్మలు మంగళవారం మట్టి నమూనాలను తీసే విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా శివకుమారి మాట్లాడుతూ రైతు సంక్షేమం కోసమే ఈ వేసవిలో మట్టి నమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఏడీఏ మస్తానమ్మ మాట్లాడుతూ వ్యవసాయ శాఖ వారు ఉచితంగా నిర్వహిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి ఏ హరి ప్రసాదు, ఏఈవో జీవన్ నాయక్, సహాయకులు లక్ష్మణ్ నాయక్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

● నూజెండ్ల: రైతులందరూ తప్పనిసరిగా భూసార పరీక్షలను చేయించుకోవాలని ఏవో ఎస్కే సుగుణాబేగం అన్నారు. మంగళవారం మండలంలోని ఐనవోలు, చింతలచెరువు రైతు సేవా కేంద్రాల పరిధిలో భూసార పరీక్షలకు మట్టి నమూనాలు స్వీకరణ కార్యక్రమంలో పాల్గొని రైతులకు, వ్యవసాయ శాఖ సిబ్బందికి సూచనలు చేశారు. మట్టి పరీక్షలకు నమూనాలు ఇచ్చిన రైతులకు శాస్త్రీయ పద్ధతిలో పరీక్షలు నిర్వహించి సాయిల్ హెల్త్ కార్డులు ఇవ్వటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు వై గోపీ, మణికంఠ, రైతులు పాల్గొన్నారు.

● నరసరావుపేట రూరల్: మండలంలోని ఎల్లమంద గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 2025 - 2026 సంవత్సరంకు మట్టి నమూనాల సేకరణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమాన్ని డీడీఏ శివకుమారి పర్యవేక్షించారు. కార్యక్రమంలో వ్యవసాయ సంచాలకులు మస్తానమ్మ, మండల వ్యవసాయ అధికారి నరేంద్రబాబు, ఏఈవో బ్రహ్మయ్య, వీపీ సాయినాథ్ రైతులు పాల్గొన్నారు.



జగ్గాపురం గ్రామంలో మట్టి నమూనాలు సేకరిస్తున్న వ్యవసాయాధికారులు

● చిలకలూరిపేట: చిలకలూరిపేట మండలం బొప్పూడిలో భూసార పరీక్ష, మట్టి నమూనాల సేకరణ కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ అధికారులు మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం డీడీఏ ఎం శివకుమారి, నరసరావుపేట సహాయ వ్యవసాయకులు పి.మస్తానమ్మ, మండల వ్యవసాయధికారి టి.శ్రీలత, ఏఈవో శ్రీనివాసరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వంపై దుష్ప్రచారం తగదు

● పల్నాడు జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు కోటిరెడ్డి

నరసరావుపేట టౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంపై మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి దుష్ప్రచారం తగదని తెలుగు యువత పల్నాడు జిల్లా అధ్యక్షుడు కుమ్మెత కోటిరెడ్డి హితవు పలికారు. మంగళవారం నరసరావుపేటలో టీడీపీ జిల్లా కార్యాలయంలో మీడియా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కుమ్మెత కోటిరెడ్డి మాట్లాడుతూ సొంత గ్రామానికి తాగునీళ్ల ఇవ్వటం లేదని, వీధి దీపాలు వేయడం లేదని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి చేస్తున్న ఆరోపణలు వాస్తవం కాదన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మంచి వ్యక్తి కాబట్టి పార్టీలు చూడకుండా అందరికి పనులు చేసిపెడుతున్నారని అన్నారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, జిల్లాలో ఉన్న ఎమ్మెల్యేలు అందరూ కూడా ఎవరికి ఏ ఇబ్బంది వచ్చినా అందరికీ పనులు చేసిపెట్టే పరిస్థితిలో ఉన్నారని వివరించారు. రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అబద్దాలు తగదన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడపై అవాకులు, చవాకులు పెలితే సహించం అన్నారు. సమావేశంలో నియోజకవర్గ తెలుగుయువత ప్రధాన కార్యదర్శి గంగిరెడ్డి శ్రీనివాస రెడ్డి, టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు ఏనుగంటి బార్గవ్‌సాయి పాల్గొన్నారు.

క్లుప్తంగా...

యడ్లపాడు, మే 6 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆస్తమా దినోత్సవాన్ని పురస్కరించుకుని నరేంద్ర సువర్ణకుమారి ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక పీహెచ్‌సీలో ఆశ కార్యకర్తలకు, ఏఎన్ఎంలకు ఆస్తమా వచ్చే కారణాలు, నివారణ చర్యలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ఉపాధ్యక్షులు ప్రసాదరావు, ఆశ వర్కర్లు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

● బొల్లాపల్లి: స్థానిక మండల కేంద్రం బొల్లాపల్లి గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై మంగళవారం గ్రామ సభలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ జిల్లా శిక్షకులు సైదయ్య, మాస్టర్ ట్రైనర్ తిరుపతిరావు, యూనిట్ ఇన్‌చార్జ్ కోటేశ్వరరావు, వేణుగోపాలరావు, నాసర్ బాబు, కోటిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

● ఈపూరు: అద్దంకి బ్రాంచి కెనాల్‌పై నిర్మించిన బ్రిడ్జిని వెడల్పు చేయాలని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రావర్ల జగ్గారావు, ముప్పాళ్ళ గ్రామస్థులు మంత్రి నారా లోకేశ్‌ను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ముప్పాళ్ళ నుంచి జిల్లా కేంద్రం నరసరావుపేట వెళ్ళేందుకు ఆ బ్రిడ్జీ పైనుంచి వెళ్ళాలి.

● చిలకలూరిపేట: విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా వేసవిలో పాఠశాలలలో తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేటు, కార్పొరేటు విద్యాసంస్థల గుర్తింపు రద్దుచేయాలని మంగళవారం ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు స్థానిక ఎంఈఓ ఏ శ్రీనివాసరావుకు వినతిపత్రాన్ని అందచేశారు. కార్యక్రమంలో జిల్లా ఏఐఎస్ఎఫ్ అధ్యక్షుడు ఎం.నాగేశ్వరరావు, సంఘం నాయకులు గుడిపల్లి జగదీష్, నాయుడు సాయి శ్రీనాథ్, కంచర్ల సన్నీ, అన్నం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

● ఈపూరు: డ్వాక్రా సంఘాల సభ్యులు తాము తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించాలని ఏపీఎం టీ సోమశేఖర్ అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో జరిగిన సమావేశంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు కాసులు, స్త్రీ నిధి మేనేజర్, సీసీలు, యానిమేటర్లు పాల్గొన్నారు.

● నరసరావుపేట టౌన్: నరసరావుపేట లింగంగుంట్ల ఎన్ఎస్‌పీ కాలనీలో స్థానికలు మంగళవారం ఆందోళన నిర్వహించారు. ప్రభుత్వ స్థలంలో నివాసం ఉంటున్న వారిని ఖాళీ చేయాలని అధికారులు నోటీసులు ఇచ్చారు. ఈ సందర్భంగా స్థానికులు ప్రజా సంఘాల నాయకులతో కలిసి ఆందోళన నిర్వహించారు.

● నరసరావుపేట టౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు ఆరు సంవత్సరాలు సర్వీసు పూర్తి చేసినవారిని క్రమబద్ధీకరించాలని సీహెచ్‌వోలు డిమాండ్ చేశారు. మంగళవారం నరసరా వుపేట పట్టణంలోని గాంధీపార్కు వద్ద మోకాళ్ళపై తొమ్మిదో రోజలు నిరసన కార్యక్రమం నిర్వహించారు.

● నరసరావుపేట లీగల్: పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు మొదటి పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రశాంతి, 24వ వార్డులో ఐదో తేదీ రాత్రి పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, మహిళలు, పెద్దలు, యువతతో కలిసి అనేక సమస్యలపై పోలీసులు చర్చించారు. కార్యక్రమంలో మొదటి పట్టణ సీఐ ఎంవీ చరణ్ సిబ్బంది పాల్గొన్నారు.

● నరసరావుపేట లీగల్: వారం రోజుల్లో నరసరావుపేట న్యాయవాద సంఘ ఎన్నికలను నిర్వహించనున్నట్లు సీనియర్ న్యాయవాది ఎన్నికల కమిషన్ చైర్మన్ మోరా ప్రతాపరెడ్డి మంగళవారం తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు శ్రీగిరి రాజు అయ్యప్పరాజు, జీవి సుబ్బారావు, బీవీఆర్ ప్రసాద్ రెడ్డి, ఎం వెంకటేశ్వర్లు చౌదరి, కే సీతారామాంజనేయులు, దాసరి ఉదయ్‌శ్రీ పాల్గొన్నారు.

● నూజెండ్ల: మండలంలోని ముత్తరాసివారిపాలెం, అల్లీబాయిపాలెం, రమణాల వారిపాలెం గ్రామాల నాయకులతో కలసి టీడీపీ సంస్థాగత ఎన్నికలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులుగా సరిమెళ్ళ పెద్ద శేషారావు, ఉపాధ్యక్షుడిగా పిన్నబోయిన నాసరయ్య, బూత్ కన్వీనర్లుగా టి.నాగేశ్వరరావు, జి.నాగేశ్వరరావు, తెలుగు యువత పి.శ్రీనివాసరావులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో డీఎల్‌డీఏ మాజీ చైర్మన్ ఎల్.వెంకటరావు, టీడీపీ మండల అధ్యక్షుడు, వినుకొండ మార్కెట్ యార్డు చైర్మన్ ఎం.మురళీకృష్ణ యాదవ్, ఎస్.బ్రహ్మయ్య పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుడికి రిమాండ్

శావల్యాపురం, మే 6 (ఆంధ్రజ్యోతి): హత్యాయత్నం కేసులో ఒకవ్యక్తిని అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి అతనికి రిమాండ్ విధించినట్లు ఎస్ఐ లేళ్ళ లోకేశ్వరరావు మంగళవారం తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ శావల్యాపురం మండలం వేల్పూరు గ్రామానికి చెందిన మేడిబోయిన వెంకటేశ్వర్లు, సాదినేని వీరాంజనేయులు అనే రైతుల పొలాల్లోని పొగాకు బేళ్ళు, వరికుప్పలకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించి దహనం చేసిన ఘటనలపై బాధితుల నుంచి వచ్చిన ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో దర్యాప్తు చేయగా అదే గ్రామానికి చెందిన బొల్లా విజయబాబు అలియాస్ బుజ్జిని నిందితుడిగా గుర్తించి అదుపులోనికి తీసుకొని సోమవారం కోర్టులో హాజరుపరిచామని, న్యాయమూర్తి అతనికి బెయిల్ మంజూరు చేసిందని తెలిపారు. అనంతరం గ్రామంలోకి వెళ్ళిన విజయబాబు కళామందిర్ సెంటర్‌లో కూర్చొని ఉన్న ఫిర్యాదుదారుడు మేడిబోయిన వెంకటేశ్వర్లును దూషించి, దాడి చేశాడు. మేడిబోయిన వెంకటేశ్వర్లు ఇచ్చిన ఫిర్యాదుమేరకు గ్రామానికి వెళ్ళి నిందితుడిని అదుపులోకి తీసుకొన్నామని, మంగళవారం రాత్రి వినుకొండ కోర్టులో హాజరుపరచగా జడ్జి అతనికి రిమాండ్ విధించినట్లు తెలిపారు.



కమ్మవారిపాలెం ఎస్టీ కాలనీ వాసులకు తాగునీరు అందించే ట్యాంకులను, కుళాయిలను ప్రారంభించిన టీడీపీ నాయకులు

ఎస్టీ కాలనీ వాసులకు తాగునీటి సౌకర్యం

నూజెండ్ల, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మవారిపాలెం ఎస్టీ కాలనీ వాసులకు టీడీపీ నాయకులు గంగినేని బాబు, నరేష్, కంచుమాటి నరేష్ తదితరులు ప్రారంభించారు. ఈ సందర్భంగా గంగినేని బాబు మాట్లాడుతూ ఎస్టీ కాలనీ వాసుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ద్వారా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, కాలనీలో సరైన నీటి వసతి లేకపోవటంతో వారికి సురక్షితమైన నీరు అందించేందుకు బోర్లు వేయించి ట్యాంకులు, కుళాయిలు ఏర్పాటు చేశామన్నారు.

సరిహద్దుల్లో ఎక్సైజ్ అధికారుల తనిఖీలు

ఈపూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): నాటు సారాయి తయారు చేసినా, విక్రయించినా ఎటువంటి కఠిన చర్యలు ఉంటాయో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ డీ వెంకటేశ్వర్లు అవగాహన కల్పించారు. ప్రకాశం-పల్నాడు జిల్లాల సరిహద్దు గుట్లపల్లి వద్ద మంగళవారం వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈపూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ సీఐ మాట్లాడుతూ అక్రమంగా మద్యం విక్రయాలు జరిపితే కఠిన చర్యలు ఉంటాయన్నారు. స్టేషన్ పరిధిలోని రొంపిచర్ల, ఈపూరు, బొల్లాపల్లి మండలాలలో ఇప్పటివరకు 59 కేసులు నమోదుచేసి 103 లీటర్లు మద్యం సీజ్ చేశామన్నారు. తనిఖీలలో ఎస్ఐ కే శీనివాసరావు,సిబ్బంది పాల్గొన్నారు.



ప్రకాశం-పల్నాడు జిల్లాల సరిహద్దులలో తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

కార్మిక చట్టాలపై న్యాయ విజ్ఞాన సదస్సు

నరసరావుపేట లీగల్, మే 6, (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట మండల న్యాయ సేవాధికాసం ఆధ్వర్యంలో మంగళవారం వేర్ హౌసింగ్ కార్పొరేషన్‌లోని ఏపీ ఎస్‌బీసీఎల్ డిపోలో అసంఘటిత కార్మిక సంక్షేమ పథకాలపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించినట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో అసంఘటిత కార్మికుల సౌలభ్యాలు, హక్కులు, ఉచిత న్యాయ సహాయం పవిత్ర అంశాలను వివరించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో రెండో అదనపు జూనియర్ న్యాయాధికారి ఎం గాయత్రి, ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు, కార్మికులు, రూరల్ పోలీసులు పాల్గొనట్లు తెలిపారు.



వినుకొండ నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలపై సీఎంకు వినతి పత్రంను అందజేస్తున్న చీఫ్‌విప్ జీవీ, మక్కెన

నియోజకవర్గ సమస్యలపై సీఎంకు వినతి

వినుకొండ, మే 6 (ఆంధ్రజ్యోతి): వినుకొండ నియోజకవర్గంలోని పలు సమస్యలపై సీఎంకు వినతిపత్రం అందించగా, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చినట్లు ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ అంజనేయులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెలగపూడి సచివాలయంలో సీఎం చంద్రబాబును ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఉమ్మడి గుంటూరు జిల్లా జీడీసీసీబీ చైర్మన్‌గా మక్కెన మల్లికార్జునరావును నియమించినందుకుగాను సీఎం చంద్రబాబుకు జీవీ, మక్కెనలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం వినుకొండని యోజకవర్గంలోని పలు సమస్యలను జీవీ చంద్రబాబు దృష్టికి తీసుకెళ్ళారు. వినుకొండలో సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటు చేయాలని, వంద పడకల ఆసుపత్రి ఆసుపత్రి నిర్మాణానికి నిధులు కేటాయించి మానవ వనరులను ఏర్పాటు చేయాలని, నియోజకవర్గంలో లోవోల్టేజీ సమస్యను పరిష్కరించేందుకు విద్యుత్ సబ్‌స్టేషన్‌లను నిర్మించాలని, ఉపాధి హామీ పథకం ద్వారా గత ప్రభుత్వ హయాంలో పనులుచేసిన కాంట్రాక్టర్లకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను విడుదల చేయాలని, ఎన్నెస్పీ కాలువలపై తూములు ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. వినుకొండ నియోజకవర్గ అభివృద్ధికి సహకరిస్తున్న సీఎం చంద్రబాబుకు జీవీ, మక్కెనలు ప్రత్యేకంగా కృతజ్ఞతలను తెలియజేశారు.

పంచాయతీరాజ్ శాఖ కమిషనర్‌ను కలిసిన ఎమ్మెల్యే చదలవాడ

నరసరావుపేట టౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కృష్ణతేజను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు వెలగపూడి కార్యాలయంలో మంగళావారం కలిశారు. నరసరావుపేట నియోజకవర్గ పరిధిలో ఉన్న బీటీ రోడ్, సీసీ రోడ్లు, పలు సమస్యలను గురించి తెలియజేశారు. పంచాయతీరాజ్ కమిషనర్ సానుకూలంగా స్పందించి సమస్యలు వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపడతామని తెలిపారు. అనంతరం ఎన్ఆర్ఈజీఏ డైరెక్టర్ షణ్ముఖను కలిశారు. 2015 నుంచి 2019 వరకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలని ఎమ్మెల్యే కోరారు. ఆయన పాటు టీడీపీ నాయకులు ఉన్నారు.



తహసీల్దార్ సురేష్‌తో స్థల పరిశీలన గురించి చర్చిస్తున్న ఏడీఆర్ఎం శ్రీనివాసరావు

ఆర్‌యూబీ నిర్మాణానికి ఉమ్మడి తనిఖీ

వినుకొండ టౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి): వినుకొండ ఏనుగుపాలెం రోడ్డులోని రైల్వే గేటుకు త్వరలో రోడ్డు అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభిస్తున్నట్లు ఏడీ ఆర్ఎం శ్రీనివాసరావు తెలిపారు. రెవెన్యూ, పోలీస్, మున్సిపాలిటీ, రైల్వే అధికారులతో మంగళవారం ఉమ్మడి తనిఖీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వే గేటుకు ఒక వైపుగా 100 మీటర్లు, మరోవైపున 120మీటర్ల పొడవుతో పాటు నూజెండ్ల రోడ్డులోని బ్రిడ్జి తరహాలో రెండు ఖానాలతో బ్రిడ్జి ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. మరోసారి స్థానిక అధికారులతో పాటు రైల్వే అధికారులతో కలిసి స్థల పరిశీలన అనంతరం మరో మూడు నెలల వ్యవధిలో పనులు ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో వినుకొండ తహసీల్దార్ సురేష్, సర్వేయర్ చండీరాణి, ఆర్ఐ శ్రీధర్‌తో పాటు రైల్వే అధికారులు పాల్గొన్నారు.

ఈ క్రాప్‌తో సంబంధం లేకుండా

అన్ని పంటలను కొనుగోలు చేయాలి

● రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి

నరసరావుపేట టౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పంటలను ఈ క్రాప్‌తో సంబంధం లేకుండా అన్ని పంటలను కొనుగోలు చేయాలని రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాలరావు డిమాండ్ చేశారు. మంగళవారం నరసరావుపేటలోని పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరేకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపూరి గోపాలరావు మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో వేలాది హెక్టార్లులో రైతులు కంది పంట కొనుగోలు చేస్తామని చెబుతున్నా పాలకులు నేడు రైతులు పండించిన పంటలను కొనుగోలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి పండించిన పంటలను ప్రభుత్వం కొనుగోలు చేయనిపక్షంలో రైతుల కుటుంబాలు ఎలా బతకాలని ప్రశ్నించారు. ఇప్పటికైనా రైతులు పండించిన అన్ని పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. రబీ సీజన్‌లో పల్నాడు జిల్లాలో వరి లక్ష మెట్రిక్ టన్నుల దిగుబడి లక్ష్యంగా ఉంటే కేవలం పదివేల మెట్రిక్ టన్నులు మాత్రమే ప్రభుత్వం కొనుగోలు చేస్తామనటం సరైనది కాదని, మొత్తం ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రాబోయే ఖరీఫ్ సీజన్‌కు సరిపడా విత్తనాలను, ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచి ఆదుకోవాలని కోరారు. లేకుంటే భవిష్యత్‌లో రైతులు చేసే ఆందోళనలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు.

కిషోరి బాలికలకు అవగాహన

రొంపిచర్ల, మే 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన రొంపిచర్ల సచివాలయంలో కిషోర బాలికలకు అవగాహన సదస్సు మంగళవారం జరిగింది. వైద్యాధికారి సాయిబాబు మాట్లాడుతూ కిషోర బాలికలు తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలు, పరిశుభ్రత గురించి వివరించారు. బాల్య వివాహాల గురించి తెలియ జేశారు. ఈ నెల 2వ తేదీ నుంచి జూన్ 10వ తేదీ వరకు కిషోర వికాస కార్యక్రమం అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్టు సూపర్‌వైజర్ శశిదేవి తెలిపారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు షమీమ్ సుల్తానా, దేవిబాయి, అంగన్‌వాడీ వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

● నాదెండ్ల: మండలంలోని నాదెండ్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో చిరుమామిళ్ళ గ్రామంలో కిశోరీ వికాసం వేసవి సెలవల శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పద్మ, ఏఎన్ఎం రాజ్యలక్ష్మి, అనూషా, కోటేశ్వరమ్మ, అన్నపూర్ణమ్మ, గోవర్ధనలక్ష్మి పాల్గొన్నారు.